# ప్రజాశక్తి

సోమవారం 25 నవంబర్ 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

# కొత్త రేషన్ కార్డులు ఎప్పుడు?

- జారీపై తొలగని ప్రతిష్టంబన
- పింఛను దరఖాస్తులకు దక్కని మోక్షం
- ప్రభుత్వ ఉత్తర్వుల కోసం వృద్ధులు, వితంతువుల ఎదురుచూపులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కొత్తగా రేషన్ కార్డులు, నూతన పింఛన్ల జారీపై ప్రతిష్టంభన నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంత వరకు ఈ అంశంపై స్పష్టమైన ఆదేశాలు రాలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 14.40 లక్షల రేషన్ కార్డులున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకున్న వారు ఉమ్మడి జిల్లాలో 40 వేల మంది వరకు ఉన్నారు. వీరి దరఖాస్తులు సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపర్చినా ఇంతవరకు మోక్షం లేదు. గత డిసెంబరు నుంచి ఇప్పటి వరకు ఏడాది కాలంలో నూతనంగా వివాహం చేసుకున్న వారు, ఒంటరి మహిళలు, ఇతర తరగతుల వారు కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేక ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు.

గతేడాది రేషన్ కార్డులు లేకపోవడం వల్ల నూతనంగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. కార్డుల్లో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఇవ్వడం లేదు. కార్డుల్లోని కొంతమంది కుటుంబ సభ్యులు మరణిస్తే వారి పేరున కార్డు వుంటే వారు ఈకేవైసి చేస్తే కానీ ఇతర సదుపాయాలు ఏవీ అందకపోవడం వల్ల రేషన్ కార్డుల్లో తదుపరి కుటుంబ పెద్దల పేరున మార్చడానికి కూడా ఇంత వరకు తగిన మార్గదర్శకాలు రాలేదు. గతేడాది ఆగస్టులో అప్పటి వైసిపి ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం ద్వారా కొంత మంది రేషన్ కార్డులిచ్చింది. గతేడాది జూన్ వరకు దరఖాస్తు చేసుకున్న వారికి కార్డులు వచ్చినా కొత్త పింఛన్లకు అవకాశం ఇవ్వకపోవడం వల్ల దాదాపు 16 నెలలుగా అర్హులైన ప్రజలు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. పలువురికి కార్డుల్లేవు.. ఉన్నా పింఛన్లు లేవు. కార్డులిస్తే గానీ పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు. 16 నెలలుగా కొత్త ▶ 2లో

# వైద్య విద్యార్థి ఆత్మహత్య

- ఏలూరు ఆశ్రం మెడికల్ కాలేజీలో ఘటన
- మృతుడు నరసరావుపేటకు చెందిన డాక్టర్ విజయసాగర్ ఏకైక కుమారుడు జవహర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వైద్యవిద్యను పూర్తి చేసి రోగులకు ప్రాణం పోయాల్సిన యువకుడు తానే ప్రాణం తీసుకున్నాడు.. తమలాగే డాక్టర్‌గా తిరిగొచ్చి జీవితంలో స్థిరపడతాడని భావించిన తల్లిదండ్రులకు తమ ఒక్కగానొక్క కొడుకు మరణ వార్త తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఏలూరు ఆశ్రం మెడికల్ కాలేజీలో వైద్యవిద్యలో పీజీ చదువుతున్న పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన విద్యార్థి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై ఏలూరు వన్‌టౌన్ సిఐ సత్యనారాయణ వివరాల ప్రకారం...

నరసరావుపేటకు డాక్టర్ వరగాని జవహర్ (30) ఏలూరు ఆశ్రం మెడికల్ కాలేజీలో పోస్టు గ్రాడ్యుయేషన్ ద్వితీయ (చివరి) సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి తొమ్మిది గంటల వరకూ ఆశ్రం ఆసుపత్రి అత్యవసర విభాగంలో విధులకు వచ్చాడు. ఉదయం ఏడు గంటల ప్రాంతంలో వాష్‌రూమ్‌లోకి వెళ్లిన జవహర్ తలుపు గడియ పెట్టుకుని ఎంత సేపటికీ బయటకు రాలేదు. 8.15 గంటలకు మిగిలిన డాక్టర్లు వెళ్లి చూడగా తలుపు వేసి ఉండడంతో ఆసుపత్రి సిఇఒ డాక్టర్ హనుమంతరావు, ఇతర అధికారులకు తెలియజేశారు. అనంతరం తలుపులను పగులగొట్టి చూడగా జవహర్ చనిపోయి ఉన్నాడు. పక్కనే ఖాళీ మత్తు ఇంజెక్షన్ బాటిళ్లు, చిరంజీలు ఉండడం వల్ల మత్తు ఇంజెక్షన్ చేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. జవహర్ మృతిపై అతని కుటుంబీకులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలిని ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సిఐ జి.సత్యనారాయణ, రూరల్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

మృతుని తండ్రి డాక్టర్ విజయసాగర్ నరసరావుపేటలో జవహర్ పేరుతోనే పిల్లల ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు. ఒక్కడే సంతానమైన జవహర్ మత్తు వైద్యుడిగా చదువుతూ మత్తు ఇంజక్షన్లు తానే చేసుకుని ఆత్మహత్యకు పాల్పడడంతో మెడికల్ కాలేజీలో తీవ్ర విషాదం నెలకొంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతదేహానికి ఆదివారం సాయంత్రం ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ఫోరెన్సిక్ హెచ్‌విడి డాక్టర్ కె.భాస్కరరావు పోస్టుమార్టం చేసి కుటుంబానికి అప్పగించారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఫీజు రియింబర్స్‌మెంట్ జరగలేదని హాల్‌టిక్కెట్లు ఆపకూడదు : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ జరగని కారణంగా విద్యార్థులకు హాల్‌టికెట్లు కానీ, తరగతులు/ప్రాక్టికల్స్ మొదలైన వాటికి హాజరు కానివ్వకుండా కళాశాలల యాజమాన్యాలు నిరోధించకూడదని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ కారణంగా కొన్ని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇవ్వడానికి నిరాకరించడం, తరగతులు/ప్రాక్టికల్స్‌కు హాజరు కాకుండా అడ్డుకోవడం వంటి విషయాలు జిల్లా యంత్రాంగం దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేరుగా కాలేజీలకు విడుదల చేస్తామని, గత బకాయిలను కూడా క్రమంగా విడుదల చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని గుర్తు చేశారు. విద్యార్థులకు హాల్ టికెట్లను తిరస్కరించకుండా, తరగతులు/ప్రాక్టికల్స్ మొదలైన వాటికి హాజరును నిరోధించకుండా సంబంధిత విద్యా శాఖ అధికారులు వారి పరిధిలో గల కళాశాలల యాజమాన్యాలకు కచ్చితమైన సూచనలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

### ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ల వద్ద

# రేపు సిపిఎం ధర్నాలు

జయప్రదం కోసం విస్తృతంగా ప్రచారాలు

వార్తలు లోపలి పేజీల్లో

ప్రదర్శనలో ఉపాధ్యాయ ప్రతినిధులు, నాయకులు

## ప్రభుత్వ విద్యను పరిరక్షించుకోవాలి

### ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

8లో

- ఘనంగా యుటిఎఫ్ గుంటూరు జిల్లా స్వర్ణోత్సవ మహాసభ
- జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా యు.రాజశేఖర్, ఎం.కళాధర్

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.ఆంజనేయులు నాయక్

## వేధింపులు ఆపకుంటే ఉద్యమం

### అంగన్వాడీల ఇబ్బందులపై పల్నాడు ఎస్పీని త్వరలోనే కలిసి విన్నవిస్తాం : సిఐటియు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ అన్నారు. నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ - హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశానికి యూనియన్ జిల్లా అధ్యక్షులు కెపి మెటిల్డాదేవి అధ్యక్షత వహించారు. ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ రాజకీయ కక్ష పెట్టుకుని పల్నాడు జిల్లాలో 15 మందికి పైగా అంగన్వాడీలతో బలవంతంగా రాజీనామాలు చేయించారని, పలువురిపై దాడులు జరిగాయని అన్నారు. రాజకీయ వేధింపులు, కక్ష సాధింపులు ఉండవని సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ▶ 2లో

మాట్లాడుతున్న డాక్టర్ కొత్తమాసు సౌమ్య

## సౌమ్య హాస్పిటల్ ప్రారంభించిన కన్నా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు చంద్రమౌళినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సౌమ్య హాస్పటల్‌ను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ అత్యాధునిక వైద్య సదుపాయాలతో స్కిన్, హెయిర్ లేజర్‌చ యాంటి ఏజింగ్ సమస్యలకు ఆధునిక టెక్నాలజీ వైద్యం అందించడం ముదావాహం అన్నారు. వైద్యులు డాక్టర్ కొత్తమాసు సౌమ్య మాట్లాడుతూ ప్రజలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో స్కిన్,హెయిర్, లేజర్ చికిత్సలు అందిస్తామన్నారు. డాక్టర్ పలుకూరి నాగేంద్ర, దాసరి శేషగిరిరావు, కొత్తమాసు శ్రీనివాసరావు, పలుకూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

## జగన్ విచారణకు గవర్నర్ అనుమతివ్వాలి : టిడిపి

ప్రజాశక్తి - సత్తెనపల్లి

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధులైన న్యాయవాదులు పూజల వెంకట కోటయ్య, దివ్వెల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. 2021-2022 సంవత్సరాల్లో 7 గిగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలు వ్యవహారంలో రూ.1750 కోట్ల లంచం ఆంధ్రప్రదేశ్ ముఖ్య అధికారికి ముట్టినట్లు అమెరికా సంయుక్త రాష్ట్రాల సెక్యూరిటీ, ఎక్స్ఛేంజ్ కమిషన్ పేర్కొనడంతో ఆంధ్రప్రదేశ్ అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిని ఆగస్టు 2021లో ఆదాని భేటీ, లంచం వ్యవహారం రుజువవుతోందని అన్నారు. జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రిగా లంచం వ్యవహారం, అమెరికా ప్రభుత్వ ఏజెన్సీ బయట పెట్టినప్పటికీ ఎమ్మెల్యేగా కొనసాగటం అనైతికమన్నారు. ఈ విషయమై జగన్మోహనరెడ్డిని విచారణ చేసేందుకు తక్షణమే పోలీసులకు రాష్ట్ర గవర్నర్ అనుమతి మంజురు చేయాలని కోరారు.

## కొత్త రేషన్ కార్డులు ఎప్పుడు?

(మొదటి పేజీ తరువాయి)

కార్డులకు, నూతన పింఛన్ల జారీపై ప్రతిష్టంభన ఏర్పడింది. గత 16 నెలల కాలంలో 60 ఏళ్ళు దాటిన వృద్ధులు, భర్తను కోల్పోయిన వితంతువులు, ప్రమాదాల్లో వైకల్యంకు గురైన వికలాంగులు పెద్ద సంఖ్యలో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎదురు చూస్తున్నారు. వీరంతా గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కానీ ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడం వల్ల నూతన పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరించడం లేదని సంబంధిత ఉద్యోగులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు 50 ఏళ్ళు దాటిన ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చింది. ఇంత వరకు ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు రాకపోవడం వల్ల 50 ఏళ్ళు దాటిన అనేక మంది నిరీక్షిస్తున్నారు. వీరికి రేషన్ కార్డులున్నా పింఛన్లపై ఇంకా స్పష్టత లేదు. ప్రస్తుతం రేషన్ కార్డులపై బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. అడపాదడపా కంది పప్పు ఇస్తున్నా అవి అందరికీ అందడం లేదు. బహిరంగ మార్కెట్‌లో కంది పప్పు ధర అధికంగా ఉండటం, ప్రభుత్వం కిలో రూ.67కి ఇస్తుండటంతో చాలా మంది వాహనదారులు కంది పప్పు వినియోగదారులకు సరిగా ఇవ్వడం లేదు.

## నేడు, రేపు రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మండలంలోని రామకృష్ణాపురం గురుకుల పాఠశాల ఆవరణంలో సోమ, మంగళవారాల్లో రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తామని జిల్లా కో-ఆర్డినేటర్ పద్మజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లోని నైపుణ్యతను గుర్తించడం కోసం ఇటువంటి ప్రదర్శనలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొలుత జిల్లాస్థాయి ప్రదర్శనలు నిర్వహించి అక్కడ ఎంపికైన వారికి జోనల్ స్థాయిలో పోటీలు పెట్టామని, ఆ స్థాయిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారని తెలిపారు. ప్రదర్శనల్లో రాష్ట్ర వ్యాప్తంగా 160 మంది విద్యార్థులు తమ నమూనాలతో పాల్గొంటారని తెలిపారు.

# మీటర్ రీడర్లపై స్మార్ట్ పిడుగు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తోంది. వీటివల్ల విద్యుత్ వినియోగదారులకు ఆర్థిక భారం ఒకెత్తయితే తమ ఉపాధికే గండిపడుతుందని మీటర్ రీడర్లు ఆందోళనకు గురవుతున్నారు. చాలీచాలని జీతాలతో కొన్నేళ్లుగా అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్న వీరు ఉద్యోగ భద్రత, సరైన వేతనాల కోసం డిమాండ్ చేస్తుండగా అవి నెరవేరడం అటుంచి స్మార్ట్ మీటర్ల పిడుగు తమ ఉపాధిపై పడుతుందని వాపోతున్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా 200కు పైగా మీటర్ రీడర్లున్నారు. ప్రతినెలా ఒకటో తేదీ నుండి 16వ తేదీ మధ్యలో విద్యుత్ మీటర్ రీడింగ్ నమోదు చేస్తుంటారు. ఒక మీటర్ రీడింగ్ తీసినందుకు సంబంధిత కాంట్రాక్టర్‌కు విద్యుత్ శాఖ పట్టణ ప్రాంతాల్లో రూ.6, గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 వరకు చెల్లిస్తుంది. ఇందులో మిషన్ ఛార్జీలు, ఫోన్ రీఛార్జి, ప్రిటింగ్ రోల్స్, మిషన్ మరమ్మతులు, ప్రయాణ ఖర్చులు పోను తమ చేతికి రూ.3 మాత్రమే వస్తుందని మీటర్ రీడర్లు చెబుతున్నారు. నెలకు 3 వేల మీటర్ల వరకూ రీడింగ్ తీస్తుండగా రూ.10 వేల వరకూ అదాయం వస్తుంది. దీనితోనే తాము జీవనం కొనసాగిస్తున్నామని, అయితే ఇప్పుడు ప్రీపెయిడ్ మీటర్లు వస్తే తమ పని పోతుందనే భయం మీటర్ రీడర్లలో నెలకొంది. ఐటిఐ, ఇంటర్, డిగ్రీలు చదువుకుని ఈ పని చేస్తున్నామని, ప్రత్యామ్నాయ ఉపాధి అయినా చూపాలని మీటర్ రీడర్లు కోరుతున్నారు. షిఫ్ట్ ఆపరేటర్లు, అటెండర్లు, వాచ్‌మెన్‌లు, డ్రైవర్లు తదితర విభాగాల్లో తమకు ఉద్యోగాలు ఇవ్వాలంటున్నారు.

# 800 మందికి చీరలు పంపిణీ

## మరో 25 మందికి ఆర్థిక సాయం అందజేసిన సామాజిక కార్యకర్త వీరాస్వామి

సాయం అందిస్తున్న పిన్నమనేని పాములయ్య తదితరులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఒక వ్యక్తి పెద్ద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి 800 మంది పేద, వృద్ధ మహిళలను సమీకరించి చీరల పంపిణీ, ఆర్థిక సహాయం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం అంటే అతనికి పేదల పట్ల ఉన్న సంకల్పానికి నిదర్శనమని సామాజిక కార్యకర్త గంజి వీరాస్వామి సేవలను ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య, సిఐలు సింగరేసు సాంబశివరావు, అవ్వారు వెంకట బ్రహ్మం అభినందించారు. స్థానిక ఫణిదం చేనేత సొసైటీ వద్ద కార్తీక మాసం సేవా కార్యక్రమాల సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సభకు ఫణిదం చేనేత సొసైటీ అధ్యక్షులు కట్ట శివదుర్గరావు అధ్యక్షత వహించారు. పాములయ్య మాట్లాడుతూ మనిషి, దు:ఖం రెండు తోబుట్టువులని, మనిషి అనేక కారణాలతో దు:ఖ సముద్రంలో ఉన్నప్పుడు ఇతరుల సహాయాన్ని అర్థిస్తాడని చెప్పారు. అలాంటి సమయంలో తనకోసం జీవించటమే కాదు పరుల కోసం జీవించాలనే తత్వంతో ఆపదలో ఉన్న వారికి, అనారోగ్యంతో ఉన్నవారికి, పేదరికంలో ఉన్న వారికి సహాయ పడాలనే సంకల్పంతో గంజి వీరాస్వామి చేస్తున్న సేవా కార్యక్రమాలు సార్థకమవుతాయని అన్నారు. సిఐలు సాంబశివరావు, వెంకట బ్రహ్మం మాట్లాడుతూ వీరస్వామి 24 ఏళ్ల నుండి ప్రతి సంవత్సరం ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పేదల ప్రాంతాల్లో తాగునీటి బోరింగు పంపులను వేయించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 25 మంది పేదలకు ఆర్థిక సహాయం, 800 మందికి చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు దివ్య శ్రీనివాసరావు, శేషయ్య, అవ్వారు రవీంద్రనాథ్ ఠాగూర్, దామర్ల వెంకట సుబ్బారావు, వంగర సదాశివరావు, చెట్టు శ్రీనివాసరావు, గాత్రం కోటేశ్వరరావు, వంగర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం శ్రేణులు

## అదానీ అరెస్టు కోసం సిపిఎం నిరసన

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

సౌర విద్యుత్ కుంభకోణంలో కేసులు ఎదుర్కొంటున్న గౌతం ఆదానీని వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి డి.రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం దేశవ్యాప్త నిరసనలో భాగంగా ఆదివారం పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రమేష్‌బాబు, నాయకులు కె.వెంకట శివరావు మాట్లాడుతూ సౌర విద్యుత్ కాంట్రాక్టు కోసం రూ.2,029 కోట్ల లంచాన్ని ఇచ్చిన కేసులో, అమెరికాలో గౌతం ఆదాని కంపెనీ మీద కేసు నమోదైందని, దీని మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం సమంజసం కాదని అన్నారు. అదానీ కంపెనీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి కేటాయించిన భూములను, రాయితీలను రద్దు చేయాలని, ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశ్శారు. ప్రభుత్వాలు ప్రజల కోసం పని చేయకుండా కార్పొరేట్లు పెట్టుబడిదారుల కోసం పనిచేస్తున్నాయని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని, విద్యుత్ రంగాన్ని ఆదాని, అంబానీలకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్టను దెబ్బతీసిన గౌతం ఆదానిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జంపని రామారావు, దేవరకొండ శ్రీనివాసరావు, నల్లమోతు రాజేంద్ర, పి భువనేశ్వరి, మర్రి లక్ష్మి, షేక్ షమీ, కొరివి విజయలక్ష్మి, డి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

## వేధింపులు ఆపకుంటే ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

చెబుతున్నా ఇవి జరుగుతున్నాయని అన్నారు. ఇతర స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగులపైనా వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. వేధింపులు, బెదిరింపులను తట్టుకుని రాజీనామా చేయకుండా అనేకమంది అంగన్వాడీలు విధులు నిర్వహిస్తున్నారని, అయితే వీరి కుటుంబ సభ్యులకు హాని చేస్తామంటూ బెదిరిస్తున్నారని, పొలం గట్ల దగ్గర రకరకాలుగా వేధింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని, అప్పటికీ పరిస్థితిలో మార్పురాకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లేశ్వరి మాట్లాడుతూ పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీ మినీ వర్కర్లు విశేష సేవలు అందిస్తున్నారని చెప్పారు. అంగన్వాడీ సెంటర్ నిర్వహణకు వర్కర్ పని, హెల్పర్ పని చేయడం వల్ల పనిభారం పెరిగిందన్నారు. మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలనే జీవో ఉన్నా అమలు చేయడం లేదన్నారు. మినీ వర్కర్లకు సెలవులు ఇవ్వడం లేదని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగలేదని చెప్పారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినీ వర్కర్లకు వేసవి సెలవులు, ఖాళీ పోస్టుల భర్తీ, మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టులకు మినీ వర్కర్లకు అవకాశం కల్పించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో 42 రోజుల సమ్మె మినిట్స్ కాపీని అమలు చేయాలన్నారు. విధులు నిర్వహిస్తూ చనిపోయిన వారికి మట్టి ఖర్చుల జీవో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నిర్మల, ప్రసన్న, సాయి కుమారి, సుజాత, సావిత్రి, జయలక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

**NOTICE**

WE, THE FOLLOWING COMMITTEE MEMBERS OF SRI SHIRDI SAINATHA SATSANG COMMITTEE, NARASARAO PET, Regd Number 528/22 HEREBY INFORM TO THE PUBLIC THAT,

We have lost Temple's Land Registered Documents and despite thorough efforts to locate the document, it remains missing. None of our Committee members has a copy of the same to obtain a public document.

In this connection, we hereby request the public that, any person finds these documents may please submit the same to our Temple Committee.

**MAMILLAPALLI SRINIVASA RAO B.A, B.Ed; LL.B.,**
**SHAIK AFFIJUNNISA B.Sc; LLB,**
**ADVOCATES, NARASARAOPET**
**Call : 8919666601 9848125114**

## జిఎంసి కాల్ సెంటర్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలకు నగర పాలకసంస్థ అందిస్తున్న సేవలపై ఈనెల 25 నుండి (ఆస్తి పన్ను మార్పు, ఆస్తి పన్ను విధింపు, నీటి కుళాయిల కనెక్షన్ లు, కుళాయిల రిపేర్లు, డ్రైన్ కనెక్షన్ లు,రిపేర్ లు, వ్యాపార లైసెన్సులు, జనన మరణ ధ్రువ పత్రాల మార్గ దర్శకాలు, వివాహ పత్రాల నమోదు) సేవలపై ఎటువంటి సందేహాలు ఉన్నా 0863-2345103, 104, 105 నెంబర్లకు సంప్రదించి సమాచారాన్ని పొందవచ్చునని నగర కమీషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించటానికి వీలైనంత త్వరలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే నగర పాలకసంస్థ కాల్ సెంటర్ ద్వారా వివిధ ప్రజా సమస్యల పరిష్కరిస్తున్నామన్నారు. సోమవారం నుండి నగర పాలక సంస్థ సచివాలయాల ద్వారా రెవిన్యూ, ప్రజా రోగ్యం, ఇంజినీరింగ్ విభాగాలలో అందించే సేవ లపై సందేహాలకు ఈకాల్ సెంటర్‌ను విని యోగించుకోవాలన్నారు. ఈ సేవలపైనా సీనియర్ అధికారుల ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందన్నారు. నగర పాలక సంస్థ కాల్ సెంటర్ ప్రతి రోజు ఉదయం 8:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు, సెలవు దినాలలో కూడా సేవలు అందిస్తుందన్నారు.

# సమాజ మార్పునకు గోరా కృషి : డాక్టర్ సమరం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాట్లాడుతున్న డాక్టర్ సమరం

మతం మనిషిని బానిసగా మారుస్తుందని, స్వేచ్ఛగా శాస్త్రీయంగా ఆలోచింపనివ్వదని, మత రహిత సమాజమే సమాజ పురోగతికి తోడ్పడుతుందని గోపరాజు రామచంద్రరావు (గోరా) విశ్వసించారని ప్రముఖ వైద్యులు డాక్టర్ జి. సమరం కొనియాడారు. ఆదివారం గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో గోపరాజు రామచంద్ర రావు జీవిత ప్రస్థానంపై జరిగిన సభలో డాక్టర్ జి. సమరం ప్రసంగించారు. సనాతన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన గోరా సమాజ మార్పునకు నాస్తికత్వం, గాంధీజీ బోధనలు దోహద పడతాయని నమ్మి జీవితాంతం ఆచరించారన్నారు. అంటరానితనం, సామాజిక అసమానతలు, మూఢ నమ్మకాలపై నిరంతరం ప్రజలను జాగృతులను చేశారని, మహాత్మాగాంధీతో పరిచయం అయిన తర్వాత సత్యాన్వేషణ ద్వారానే ప్రజల్లో మార్పు తీసుకురాగలమని గాంధీజీని సైతం ప్రభావితం చేసిన మహనీయులు గోరా అని తెలిపారు. ప్రతి మనిషి శాస్త్రీయంగా ఆలోచించి, జీవితానికి అన్వయింపు చేసుకొని పురోగమించాలని గోరా బోధించారన్నారు. అసమానతలు, అంతరాలు, దోపిడీ లేని సమాజం కోసం కలలు గన్నారన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ గుర్రం జాషువా కుమార్తె హేమలతను తన కోడలుగా స్వీకరించి ఆనాటి కులాలకు అతీతంగా ఆచరణలో అమలు చేశారన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ గోరా కుటుంబం నాటి సమాజంలో ఉన్న జోగిని, దేవదాసి వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడిందని, స్టువర్టుపురంలో కరుడు గట్టిన దొంగలలో మార్పు తీసుకువచ్చి వారికి విద్య, వైద్యం, వసతి సదుపాయాలను కల్పించి, జనజీవన స్రవంతిలో కలిపారన్నారు. మాజీ శాసనసభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు, మానవత చైర్మన్ పావులూరి రమేష్, నేస్తం సహ వ్యవస్థాపకులు టి. ధనుంజయ రెడ్డి, గాంధీయవాది, యోగా శిక్షకులు ఇందుశేఖర్, హేతువాది చంద్రశేఖర్ ప్రసంగించారు.

## రెండు వాహనాల ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం రోడ్డు దాటుతున్న మరొక వాహనాన్ని ఢీ కొట్టిన సంఘటనలో ఒక యువకుడు, వృద్ధుడు మృతి చెందారు. గుంటూరు విద్యానగర్ రింగురోడ్డు ఐటిసి హోటల్ సమీపంలో శనివారం అర్ధరాత్రి ఈ దుర్ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వికాస్ నగర్ 5వ లైన్ కు చెందిన దాసరి రమేష్ (64) అనే వృద్ధుడు ఇంటికి వెళ్లడం కోసం బైక్ పై రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో గుజ్జనగుండ్ల వైపు నుంచి కొరిటపాడుకు మల్లేష్ (22) అనే యువకుడు బైక్ పై వేగంగా వస్తున్నాడు. విద్యానగర్ ప్రాంతానికి వచ్చేసరికి బైక్ వేగం అదుపుతప్పి రమేష్ వాహనాన్ని ఢీకొట్టాడు. సంఘటనలో వృద్ధుడు రమేష్ అక్కడే మృతిచెందగా మల్లేష్‌కు కూడా తీవ్ర గాయాలైనాయి. అనంతరం వైద్యశాలలో చికిత్స పొందుతూ చనిపోయాడు. ఇరువురికి తలపై రక్త గాయాలు కావడంతో మృతి చెందినట్లు వైద్యులు చెప్పారని పోలీసులు పేర్కొన్నారు. మృతి చెందిన రమేష్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉంటాడు. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడు మల్లేష్ ఇటీవల బీటెక్ పూర్తి చేశాడు. రింగ్ రోడ్డు రహదారిపై పలుచోట్ల వేగ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుంటూరు పశ్చిమ విభాగం ట్రాఫిక్ సిఐ సింగయ్య తెలిపారు. శవ పరీక్ష అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సిఐ పేర్కొన్నారు. రహదారిపై స్పీడ్ బేకర్ల ఏర్పాటు గురించి తాను పలుసార్లు ఆర్ అండ్ బి అధికారులకు లేఖ రాశామన్నారు. ఆర్ అండ్ బి అధికారులు స్పందించకపోతే ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన నగర కమిషనర్

**ప్రజాశక్తి-గుంటూరు :** ప్రతి పోలింగ్ కేంద్రంలో పిఎస్ నంబర్, బిఎల్ఓ పేరుతో బోర్డులు ఏర్పాటు చేయాలని నగర కమిషనర్, తూర్పు ఈఆర్ఓ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌లో భాగంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ఉర్దూ స్కూల్‌లోని 124, 125, 126, 132 నుండి 136 వరకు, 139 పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్, ఈఆర్ఓ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రాల్లో పిఎస్ నెంబర్, బిఎల్ఓ పేరుతో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌లో అందిన ఫారాలు పక్కాగా ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. క్యాంపెయిన్‌లో ప్రజల నుండి నూతన ఓటుకై దరఖాస్తు అర్జీలు తీసుకోవడం జరిగిందన్నారు. ఓటర్ కార్డ్‌లో చిరునామా, పేరు, పుట్టిన తేది తదితర మార్పుల కోసం అర్జీలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఆర్ఓ డి.శ్రీనివాసరావు, సూపర్వైజరీ అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

## ముగ్గురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ముందస్తు సమాచారంతో పేకాట స్థావరంపై దాడి చేసి ముగ్గురుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వి.సోమేశ్వరరావు ఆదివారం తెలిపారు. చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు చాగంటివారిపాలెం నుండి లంకెలకూరపాడు వెళ్ళే దారిలో పేకాట ఆడుతున్నారనీ, వారి వద్ద నుండి రూ.2,910 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఆదానీ కంపెనీలతో ఒప్పందాలన్నీ రద్దు చేసుకోవాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు**

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రపంచ కుబేరుడైన ఆదాని కుంభకోణాలు అమెరికా కోర్టులు బయట పెట్టడంతో దేశంలో ఆదానితో చేసుకున్న ఒప్పందాలన్నీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి తాడేపల్లి బోసు బొమ్మ సెంటర్లో ఆదాని అవినీతిని ఎండగడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని దేశాలు, మనదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఒప్పందాలు రద్దు చేసుకున్నాయని చెప్పారు, రాష్ట్రంలో విద్యుత్ కొనుగోలులో కూడా గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందంలో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని, అమెరికా దర్యాప్తు సంస్థలు బయట పెట్టడంతో వీటిపై కూడా నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. లక్షల కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడిన ఆదానిని మోడీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఆరోపణలు లేకుండా దేశంలోని తనకు నచ్చని వారిని అరెస్ట్ చేసి జైల్లో పెడుతున్న బిజెపి ప్రభుత్వం, తన గమిత్రుడైన ఆదా నిని అరెస్ట్ చేసి తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాటు సారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

నిషేధిత నాటుసారా విక్రయానికి పాల్పడుతున్న ఒక మహిళను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎన్ వెంకటరమణ తెలిపారు. సీఐ వెంకటరమణ మాట్లాడుతూ పట్టణంలోని రైల్వే గేట్ సమీపంలో గత కొంతకాలంగా గుట్టు చప్పుడు కాకుండా నాటుసారా అమ్మకం జరుపుతున్నట్లు సమాచారమందిందన్నారు. ఆమె వద్ద నుండి 2.5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు మహిళపై కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపినట్లు తెలిపారు.

## నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సర్వసభ్య సమావేశం నేడు మున్సిపల్ సమావేశపు మందిరంలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ బండి శేషన్న ఆదివారం ఓ ప్రకనటలో తెలిపారు. చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన అత్యవసర సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

# జాబ్‌మేళాలో 3,604 మంది ఎంపిక

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశా లతో నిర్వహించిన మెగా జాబ్ మేళా నిరుద్యోగులకు వరంలా మారింది. జాబ్‌మేళాకు 11,500 మందికి పైగా హాజరవ్వగా ప్రతిభ, అవగాహన సామర్థ్యం ఆధారంగా 3,604 మందికి ఉద్యోగాలు లభించాయి. నిరు ద్యోగ యువతి, యువకుల కోసం ఐటీ, డాటా ఎంట్రీ, బి.పి.ఓ, రిటైల్, ఈ కామర్స్, టూరిజం అండ్ హాస్పిటలిటి, హోటల్ మేనేజ్ మెంట్, ఆటోమోటివ్, వైద్య ఫార్మసీ, ఎలక్ట్రికల్, బ్యాంకింగ్, పేటీఎం, ఎయిల్ టెల్, రిలయన్స్, హీరో మోటర్స్, మాస్టర్ మైండ్స్, శ్రీరాం ఫైనాన్స్, ఇన్సూరెన్స్, మెడ్ ప్లస్ ఇతర బ్యూటీ రంగాలలో ఉద్యోగ అవకాశాల కల్పనకై మెగా జాబ్ మేళాను వీటిజేఎం అండ్ ఐవిటిఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఘనంగా నిర్వహించారు. జాబ్ మేళాకు నియోజకవర్గం నుంచే కాకుండా రాష్ట్రంలోనే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన వారు, ఇంటర్, డిప్లమా, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్, హెూటల్ మేనేజ్‌మెంట్, బీఈ, బీటెక్, ఎంటెక్, బీఏ, బీఎస్సీ, బీకామ్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. 60 పైగా కంపెనీల్లో ఉద్యోగాలకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలు ఆధారంగా కంపెనీల్లో రూ.15వేల మొదలుకొని రూ.60వేల వరకూ జీతం లభించే ఉద్యోగాలకు 3,604 మందిని ఎంపిక చేసి నియామాక ఉత్తర్వులు కూటమి నాయకుల చేతుల మీదగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ షేక్ అలీమ్ బాషా, ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



అర్హత పొందిన వారికి పత్రాలు అందజేస్తున్న కూటమి నాయకులు

## ఎపిఎన్‌జిఓ నాయకులు బ్రహ్మారెడ్డి మృతి

ప్రజాశక్తి-గుంటూరు

ఎపి ఎన్‌జిఓ అసోసియేషన్ అమ రావతి తాలూకా అధ్యక్షులు వజ్రాల బ్రహ్మారెడ్డి(56) ఆదివారం గుండె పోటుతో గుంటూరు జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. బ్రహ్మారెడ్డి వైద్య ఆరోగ్యశాఖలో ఎంపిహెచ్‌ఇఒగా పనిచేస్తున్నారు. బ్రహ్మారెడ్డి భౌతిక ఖాయాన్ని ఎన్‌జిఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఘంటసాల శ్రీనివాసరావు, శెట్టిపల్లి సతీష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగుల్ షరీఫ్, సిటీ ప్రెసిడెంట్, సెక్రెటరీ సూరి, కళ్యాణ్ తదితరులు సందర్శించి నివాళి అర్పించారు.

## అదానీ కంపెనీలతో ఒప్పందాలను రద్దు చేయాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రవేశపెట్టి ప్రజల నుండి ముక్కు పిండి విద్యుత్ చార్జీలు వసూలు చేసే అవకాశం గౌతం అదానీకి రాష్ట్ర ప్రభుత్వం కల్పించడాన్ని ఖండిస్తున్నామని పిడిఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు పిడిఎం ఆధ్వర్యంలో ఆదివారం నరసరవుపేట మార్కెట్ యార్డ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను ప్రస్తుత ప్రభుత్వమైనా రద్దు చేయాలన్నారు. విద్యుత్ వినియోగించాలంటే ముందుగానే రీఛార్జీ చేసుకునే సదుపాయం, వెసులుబాటు అందరికీ ఉండదని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎం నాయకులు ఎన్.రామారావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ పాల్గొన్నారు.

## వాలీబాల్ విజేత రాజేష్ టీం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

క్రీడలపై యువత మక్కువ పెంచుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం మాచర్ల మండలం తాళ్లపల్లిలో క్రీస్తు లూధరన్ దేవాలయం 10వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానోత్సవం ఆదివారం నిర్వహించారు. విజేతగా నిలిచిన రాజేష్ టీంకు రూ.30 వేల నగదుతోపాటు కప్పును ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత కార్యదర్శి సైదారావు, జి.శ్రీను, హుస్సేన్, బ్రహ్మయ్య, వి.నాగరాజు, గోపిరాజు, సాంబశివరావు పాల్గొన్నారు.

## టిడిపిలో చేరిన మాజీ జెడ్‌పిటిసి శేరెడ్డి గోపిరెడ్డి

మాచర్ల మాజీ జెడ్‌పిటిసి, సీనియర్ నాయకులు శేరెడ్డి గోపీరెడ్డి వైసిపిని వీడారు. ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి సమక్షంలోలో ఆదివారం ఆయన టిడిపిలో చేరారు. ఆయనతో పాటు 50 మంది వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో కాసిరెడ్డి, మోహన్‌రావు, శౌరెడ్డి, రెంటల అంజయ్య, నదిగం ప్రభాకర్, దేవదాసు, గోపి, పరుశురాం, పున్నయ్య ఉన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల ముసాయిదా ఓటర్ల జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి-ఈపూరు

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ నంబరు 367 నూతన ముసాయిదా ఓటర్ల జాబితాను స్థానిక తహసిల్దార్ కార్యాలయం, ఈపూరు పోలింగ్ స్టేషన్, జెడ్పీ పాఠశాల వద్ద ప్రదర్శనకు ఉంచినట్లు తహశీల్దార్ ఎ.నళిని తెలిపారు. దరఖాస్తు చేసిన వారు ఓటు ఉన్నదో లేదో ఓటర్ల జాబితాలో పరిశీలించుకోవాలని, అభ్యంతరాలుంటే తెలపాలని కోరారు.

# దళారుల నుండి రైతు పేరుతో..

- కొనుగోలు కేంద్రంలో మారుపేరుతో పత్తి అమ్మకాలు
- సిసిఐ కేంద్రంలో నిబంధనలకు విసిగి వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు
- రూ.వెయ్యికిపైగా ధర దిగ్గోసి కొనుగోలు - ఆపై సిసిఐలో అమ్మకం

ప్రజాశక్తి - పెదకూరపాడు

అమ్మబోతే అడవి కొనబోతే కొరివి అనే సామెత ప్రస్తుతం పత్తి రైతులకు అచ్చుగుద్దినట్టు సరిపోతుంది. వాణిజ్య పంటలైన పత్తి, మిర్చికి పెదకూరపాడు ప్రాంతం ప్రసిద్ధిగాంచింది. అయితే మిర్చి మిగిల్చే నష్టాల ఘాటును తట్టుకోలేని రైతులు పత్తి, అపరసాల సాగుకు మొగ్గారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో బెల్లంకొండ, అమరావతి, అచ్చంపేట, పెదకూరపాడు, క్రోసూరు మండలాల్లో పత్తి సుమారు 14 వేల ఎకరాల్లో సాగైంది. అతివృష్టి, అనావృష్టి తట్టుకొని పంటను రైతులు దక్కించుకున్నారు. ఎకరాకు 6 నుండి 9 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. అయితే పత్తి తీత సమయంలో వానల నేపథ్యంలో తేమ శాతం అధికంగా ఉంటే పంటను కొనుగోలు చెయ్యరని పెద్ద ఎత్తున ప్రచారమైంది. దీన్ని అసరాగా చేసుకున్న కమీషన్ వ్యాపారులు రూ.5500కు కొనుగోలు చేశారు. అప్పులు ఒత్తిడి నేపథ్యంలో పంటను దాచుకోవడానికి వీల్లేని రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ఇదే ధరకు పంటను తెగనమ్ముకున్నారు.

అనంతరం రైతు సంఘాల పోరాట నేపథ్యంలో సిసిఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. రూ.క్వింటాళ్ మద్దతు ధర రూ.7512కు కొనుగోలు చేస్తామని ప్రకటించారు. పెదకూరపాడు నియోజకవర్గానికి ధూళిపాళ్ల, సత్తెనపల్లిలోని మిల్లును కేటాయించారు. పంట అమ్ముకోవాలనుకున్న రైతులు తమ

పేర్లను రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకుని వారికి కేటాయించిన రోజు పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్తున్నారు. తీరా పంటను తీసుకెళ్లాక గుడ్డి పత్తి, తేమశాతం అంటూ నానా రకాల నిబంధనలు పెట్టి పత్తిని కొనడం లేదు. ఈ అనుభవాలతో విసుగెత్తిన రైతులు చివరికి కమీషన్ వ్యాపారులనే ఆశ్రయించక తప్పడం లేదు. వీరు రైతుల వద్ద రూ.6 వేల నుండి రూ.6500కు కొని అదే పంటను రైతుల పేరుతో సిసిఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుంటున్నారు.

ప్రాసెసింగ్ సమయంలో రైతులకైతే నిబంధనలు వస్తున్నాయనిగాని దళారులకు మాత్రం అవేమీ ఉండడం లేదు. తేమశాతం 12 దాటితే ఒక్కో పాయింట్‌కు రైతులకైతే రూ.75 రూపాయాలు తెగ్గోస్తుండగా దళారులకు ఈ నిబంధన పట్టడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో రైతులు దళారులనే ఆశ్రయిస్తుండగా వారు సిపిఐకి అయితే ఈ ధర.. జిన్నింగ్ మిల్లుకైతే ఈ ధర.. అని చెప్పి మరీ పంటను కొంటున్నారు.. సిసిఐకి అమ్మాలని అడిగితే తక్కువ ధరకు పంటను కొని అదే రైతు పేరుతో సిసిఐ కేంద్రంలో మద్దతు ధరకు అమ్ముకుని మిగతిలిన మొత్తాన్ని దళారులు మింగుతున్నారు. రైతు కింటాళ్‌కు రూ.వెయ్యికిపైగా నష్టపోతున్నాడు. పత్తి కొనుగోళ్ల విషయంలో నిబంధనలు సడలించాలని, మద్దతు ధర రైతులకు పూర్తిగా దక్కేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు, క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రాంగోపాల్‌రావు కోరారు.

**పంటను రైతుల వద్ద నేరుగా కొనాలి**

**డి.శేషారావు, రైతుసంఘం నాయకులు**

గ్రామాలో రైతుల వద్ద పంటను సిసిఐ నేరుగా కొనుగోలు చేయాలి. వ్యవసాయ శాఖ, ఇతర అధికారులతో కలిసి రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి తేమ శాతాన్ని పరీక్షించాలి. అన్నీ బాగుంటే పంటను తీసుకునివెళ్లాలి. తద్వారా రైతులకు రవాణా భారం తగ్గుతుంది. రైతులు గత నాలుగేళ్లలో ఒక ఏడాది మినహా మిగతా మూడేళ్లూ నష్టాలనే చవిచూశారు. ఇప్పుడు పంటను నిబంధనల సాకుతో కొనకుండా తిరస్కరించి మరింత నష్టపరచొద్దు.

మహాసభలో మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్

## పత్తి కొనుగోళ్లలో నిబంధనలను సడలించాలి

### సిపిఎం ముప్పాళ్ల మండల మహాసభలో తీర్మానం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

కార్పొరేట్లకు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తున్న ప్రభుత్వాలు ప్రజలపై ఛార్జీలు, ధరల భారం వేస్తున్నాయని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ విమర్శించారు. ఆ పార్టీ మండల మహాసభ ముప్పాళ్లలో ఆదివారం నిర్వహించగా కార్యదర్శిగా గుంటుపల్లి బాలకృష్ణ మరోసారి ఎన్నికయ్యారు. సభ్యులుగా జి.జాలయ్య, డి.చిన్నారావు, టి.అమరాలింగేశ్వరరావు, జి.నరసింహారావు, టి.మస్తాన్‌రావు, జి.రజని, ఆర్.శివపార్వతిని మహాసభ ఎన్నికుంది. కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలను సడలించి రైతుల వద్దనున్న పత్తి పంట మొత్తాన్ని కొనాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి డిమాండ్ చేస్తూ తీర్మానాలను మహాసభలో ఆమోదించారు. మహాసభలో సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు పాల్గొన్నారు.

## రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించుకోవాలి

### హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న నర్రా శ్రీనివాసరావు

రాజ్యాంగ స్ఫూర్తిని రక్షించుకోవటం సమాజంలో ప్రతి పౌరుడి బాధ్యతని హైకోర్టు న్యాయవాది, ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు అన్నారు. 'రాజ్యాంగ లక్ష్యాలు - పౌర సమాజం బాధ్యత' అనే అంశంపై రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో గుంటూరులో ఆదివారం చర్చాగోష్టి నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజ్యాంగానికి నేడు అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, రాజ్యాంగ రక్షణ కీలకమైన కర్తవ్యమని అన్నారు. ఆదేశిక సూత్రాలను అమలు చేసుకుంటే రాజ్యాంగ స్ఫూర్తిని ఇనుమడింప చేసిన వాళ్లం అవుతామని, తద్వారా దేశాభివృద్ధి, రాష్ట్ర అభివృద్ది సాధించుకోగలమని చెప్పారు. భారతీయ పౌరులు కుల, మత బేధం లేకుండా సోదర భావంతో మెలిగి దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జి.సుబ్బారావు, సెక్రెటరీ పి.శివప్రసాద్, ట్రెజరర్ టి.వి.సీతారామయ్య పాల్గొన్నారు.

## ఆదర్శవంతమైన జీవితం గడిపిన ఆదినారాయణ

### సంతాప సభలో సిపిఎం నాయకులు గద్దె చలమయ్య - పలువురు నివాళి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

డాక్టర్ మామిడి ఆదినారాయణ సిపిఎం సభ్యునిగా ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య అన్నారు. స్థానిక కొత్తపేటలోని ఆదివారం జరిగిన ఆదినారాయణ సంతాప సభకు ఎ.వీరబ్రహ్మం అధ్యక్షత వహించారు. ఆదినారాయణ చిత్రపటానికి పలువురు పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ ఆదినారాయణ తల్లిదండ్రులు సౌభాగ్యమ్మ, భద్రయ్య, పెదనాన్న వెంకట్రామయ్య కుటుంబాలు కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంతో మమేకమయ్యాయని చెప్పారు. వారి వారసత్వంగా ఆదినారాయణ తన చిన్నతనం నుండి యువజన సంఘంలో, సిపిఎం ఉద్యమాల్లోనూ పాల్గొని కమ్యూనిస్టుగా జీవించారని చెప్పారు. ఆర్‌ఎంపి డాక్టర్‌గా పేదలకు అతి తక్కువ ఖర్చుకు వైద్యం చేస్తూ పేదల డాక్టర్‌గా గుర్తింపు పొందారన్నారు. ప్రజల కోసం నిలిచి పనిచేసేది కమ్యూనిస్టులేనని ఉద్ఘాటించారు. బూర్జువా పార్టీలకు చెందిన వారు తమ స్వప్రయోజనాల కోసం ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి జారుకునే అవకాశవాదులని విమర్శించారు. అలాంటి వారు ప్రజల సమస్యలపై స్పందించరని, వారికి వారి సొంత ప్రయోజనాలే ముఖ్యంగా వ్యవహరిస్తారని అన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల, నాయకులు గద్దె ఉమశ్రీ మాట్లాడుతూ ఆదినారాయణ ఆర్‌ఎంపి డాక్టర్‌గా తన వృత్తి చేసుకుంటూనే ప్రజా సంఘాల కార్యక్రమాలకు, సిపిఎం ప్రజా ఉద్యమాలకు మద్దతిస్తూ ఉండేవారని, పలు కార్యక్రమాల్లోనూ పాల్గొనేవారని గుర్తు చేశారు. సభలో సిపిఎం నాయకులు ఎం.హరిపోతురాజు, పి.సూర్యప్రకాశరావు, పి.ప్రభాకర్, జె.రాజకుమార్, జి.సుసులోవ్ మాట్లాడి ఆదినారాయణ సేవలను కొనియాడారు. ముందుగా ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు దుగ్గి నాగేశ్వరరావు విప్లవ గేయాలను ఆలపించారు. ఎ.వెంకట్ నారాయణ, ఎం.జగన్నాథరావు, పి.వీరేశం, కె.శంకరరావు, బి.రామారావు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న గద్దె చలమయ్య

# గుంటూరులో రేపటి ర్యాలీ, ధర్నాను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి -దుగ్గిరాల**

గుంటూరులో శంకర్ విలాస్ సెంటర్ నుండి 26న జరుగు ప్రదర్శన మార్కెట్ సెంటర్ లో జరుగు సభను జయప్రదం చేయాలని దుగ్గిరాల మండలం తుమ్మపూడి చిలువూరు గ్రామాలలో జరిగిన ప్రచార కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ కార్పొరేట్లను పెంచి పోషిస్తుందని విమర్శించారు. ఈ నేపథ్యంలో నవంబర్ 26 రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా 500 జిల్లాలలో భారీ ఎత్తున రైతులు కౌలు రైతులు వ్యవసాయ కార్మికులు కార్మికులు ఇతర ప్రజా సంఘాలు యావన్మంది సమీకృతమై ఆందోళనలు చేపడతారన్నారు. ఈ న్యాయమైన డిమాండ్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించి పరిష్కరించనిచో భవిష్యత్తు కాలంలో మరింత తీవ్రంగా ప్రజా ఉద్యమాలు నిర్వహించవలసి వస్తుందని హెచ్చరిక నోటీసు జిల్లా కలెక్టర్ గారి ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకి పంపిస్తామన్నారు. పెదవడ్లపూడి హై లెవెల్ ఛానల్ వెంటనే పూర్తి చేయాలి తదితర డిమాండ్స్ తో జరుగు నవంబర్ 26 ప్రదర్శన సభను జయప్రదం చేయాలని కోరారు కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు రైతు సంఘం కార్యదర్శి వై బ్రహ్మేశ్వరరావు కౌలు రైతు సంఘం అధ్యక్షులు అమ్మిరెడ్డి జి బాలచంద్రులు వెంకటేశ్వరరావు ఎం మంగయ్య పాల్గొన్నారు.

దుగ్గిరాల ప్రచారంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

కొల్లిపర ప్రచారంలో మాట్లాడుతున్న సాంబిరెడ్డి

గుంటూరులో కార్మికసంఘాల ప్రచారం

**ప్రజాశక్తి - కొల్లిపర**

వరదల కారణంగా పంట పొలాల్లో ఇసుక మేటలు వేసిందని ఇంతవరకు ఇసుక మేటను తొలగించేందుకు ప్రభుత్వము చర్యలు తీసుకో లేదని ఎకరాకు రూ.10000 ఖర్చు అవుతుం దని రైతులు తెలిపారని , ఈ ఖర్చును ప్రభుత్వమే భరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మొలక శివ సాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కొల్లిపర మండలంలోని అన్నవరపు లక గ్రామంలో రైతులు, కౌలు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి నవంబర్ 26న గుంటూరులో జరిగే మహాప్రదర్శనలో జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల కారణంగా నష్టపోయిన రైతులకు అరకొర సాయం చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందని వ్యవసాయ పంపు సెట్లు విద్యుత్ మీటర్లు బిగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. నూటికి 80శాతం ఉన్న కౌలు రైతులకు కౌలు కార్డులు గానీ రుణాలు గానీ అందకపోవడంతో నూటికి మూడు రూపాయలు వడ్డీకి తీసుకువచ్చి వ్యవసాయం చేయాల్సిన దుస్థితి నెలకొంది అన్నారు. వరదల కారణంగా పాడైపోయిన విద్యుత్ మోటార్లను మరమ్మతులు చేయించే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వము హామీ ఇచ్చి ఇంతవరకు అమలు చేయకపోవడం అన్యాయం అన్నారు. కార్యక్రమంలో గురువింద పల్లి శ్రీనివాసరావు రైతులు కౌలు రైతులు పాల్గొన్నారు

**ప్రజాశక్తి-గుంటూరు**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, ఈనెల 26న దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల పిలుపు మేరకు గుంటూరులో శంకర్ విలాస్ సెంటర్ నుండి మార్కెట్ సెంటర్ వరకూ జరిగే ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి యం.హనుమంతరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. 26న ర్యాలీ, సభను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం గుంటూరు శంకర్ విలాస్ సెంటర్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. కరపత్రాల పంపిణీలో సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, కార్యదర్శి బి.లక్ష్మణరావు, బి.ముత్యాలరావు, ఎస్.కె కాశిం షహీద్, యన్.రమేష్, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, సిఐటియు నాయకులు ఆది నికల్సన్, పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-గుంటూరు**

కేంద్ర కార్మిక, రైతు సంఘాల దేశవ్యాప్త పిలుపు మేరకు ఈనెల 26న గుంటూరులో జరిగే కార్మిక, రైతు ప్రదర్శన, సభలో అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అర్బన్ ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి టి.రాధ కోరారు. ఆదివారం పాతగుంటూరులోని సిఐటియు కార్యాలయంలో జరిగిన యూనియన్ సమావేశంలో ర్యాలీ, సభకు సంబంధించిన కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో సంధ్య, సుజని, రజిని పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన ఎన్‌సిసి విద్యార్థులు

## సేవా కార్యక్రమాల్లో ఆర్‌విఆర్ ఎన్‌సిసి క్యాడెట్లు

**ప్రజాశక్తి-గుంటూరు**

సేవకు, మానవత్వానికి మారుపేరుగా ఎన్‌సిసి విద్యార్థులు నిలవాలని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని ఆకాంక్షించారు. ఆదివారం ఎన్‌సిసి డేని పురస్కరించుకొని చౌడవరం కళాశాల ఎన్‌సిసి విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. గుంటూరు నగరంలోని డాక్టర్ కె. బసవపున్నయ్య ఆశ్రమం, పలు వధాశ్రమాలను సందర్శించి, అక్కడ వున్న వారితో కొంతసేపు ప్రేమతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి పండ్లను, రొట్టెలను, బిస్కెట్లను పంపిణీ చేసారు. వివిధ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తమ కళాశాల ఎన్‌సిసి విభాగాలకు వచ్చిన పలు పతకాలు, ప్రశంసా పత్రాలు తమ కళాశాల ఎన్‌సిసి విద్యార్థుల సేవా నిరతికి నిదర్శనమని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఎన్‌సిసి అధికారులు పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న పాశం రామారావు

## మతోన్మాద శక్తుల్ని బలహీన పరచాలి

**తాడేపల్లి పట్టణ మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు**

**ప్రజాశక్తి-తాడేపల్లి**

దేశంలోని మతోన్మాద శక్తులను బలహీనపరచాలి... ఓడించాలి... నిర్వీర్యం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఎం తాడేపల్లి పట్టణ 5వ మహాసభ మేకా అమరారెడ్డి భవన్‌లో బూరుగ సరస్వతి, సోలా ముత్యాలరావు ప్రాంగణంలో నిర్వహించారు. మహాసభకు నాయకులు వేముల దుర్గారావు, ఉష, కోట బాబురావు అధ్యక్షత వహించారు. ముందుగా బోసు బొమ్మ సెంటర్లోని అరుణ పతాకాన్ని విశ్రాంతి తాడేపల్లి పంచాయతీ ఉద్యోగి వై మల్లారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం అమర వీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించారు. కూటం ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.20వేలు పెట్టుబడి సాయం అందించాలని మహాసభ తీర్మానించింది. పంట కాలువలు పూడిక తీయాలని, వివిధ ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న పేదలకు ఎక్కడికక్కడే పట్టాలి ఇవ్వాలని, రైల్వే అధికారుల వేధింపుల నుండి రక్షణ కల్పించాలని, కృష్ణానది ఒడ్డున రిటైనింగ్ వాల్ నిర్మించాలని, నూతన మద్యం పాలసీని రద్దు చేయాలని, తాడేపల్లి బకింగ్ ఆన్ కాలవపై డబల్ లైన్ బ్రిడ్జి నిర్మించాలని, పెరిగిన అధిక ధరలను తగ్గించాలని, ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల న్యాయమైన సమస్యను పరిష్కరించాలని, భావన నిర్మాణ సంక్షేమ కార్మిక బోర్డును పునరుద్ధరించాలని. ఉచిత ఇసుకను పూర్తిగా అందుబాటులోకి తేవాలని మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది.

మహాసభలో పాశం రామారావు ప్రారంభ ఉపన్యాసం చేస్తూ కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను వినియో గించుకొని ప్రతిపక్ష పార్టీల నాయకులను బిజెపి ప్రభుత్వం జైలు పాలు చేస్తుందని విమర్శించారు. ధరలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజలు కొనుగోలు చేయలేని విధంగా ధరలు పెంచారని మండిపడ్డారు. అంతర్జాతీయ స్థాయిలో క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగిన దేశంలో పెట్రో గ్యాస్ ఉత్పత్తులు తగ్గించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మహిళలపై హత్యలు, అత్యాచారాలు అధికంగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సెక్స్ పథకాలను అమలు చేయాలని కోరారు. అధికారంలోకి వస్తే గత ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ పొందాలని రద్దు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.18 వేల కోట్ల చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపేరని విమర్శించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వీధి వీధి నా వెలసిన బెల్ట్ షాపులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అఖిలభారత సిపిఎం కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం దేశంలోని అభ్యుదయ శక్తులకు తీరని లోటని చెప్పారు. రాష్ట్రంలోని పవన్ కళ్యాణ్ ను బిజెపి అడ్డం పెట్టుకొని సనాతన ధర్మం పేరుతో మతాన్ని రెచ్చగొట్టి ప్రజలతో ఆటలాడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై నేతాజీ, రవి మాట్లాడుతూ తాడేపల్లి ఉద్యమం అనేక త్యాగాలు, ఆటుపోట్లు ఎదుర్కొని ముందుకు సాగిందని పేర్కొన్నారు. ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులఉద్యమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. తాడేపల్లి ప్రాంతంలో ప్రజలకు అభివృద్ధి ఫలాలు దక్కాయి అంటే సిపిఎం వల్లనేనని స్పష్టం చేశారు. ప్రపంచ బ్యాంకు విధానాలతో ప్రజా రాజధాని ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. రాజధాని పనుల్లో స్థానికులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘంజిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, సిపిఎం నాయకులు దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తాడేపల్లి ప్రాంతంలో పేదలకు 20వేల మందికి ఇళ్ల స్థలాలు దక్కాయ్ అంటే సిపిఎం వల్లనేనని స్పష్టం చేశారు. పనిచేసిన చోట ఫలితాలు రాబట్టడానికి సిపిఎం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై నేతాజీ, బూరుగ సరస్వతి, సోలా ముత్యాలరావు చిత్రపటాలకు జొన్న శివశంకరరావు, దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గేయాలు ఆలపించారు. అనంతరం సిపిఎం తాడేపల్లి పట్టణ కమిటీ 11 మందితో ఏర్పాటయింది. పట్టణ కార్యదర్శిగా బూరుగ వెంకటేశ్వర్లు, కార్యదర్శివర్గ సభ్యులుగా జి సుబ్బారెడ్డి, డి శ్రీనివాస్ కుమారి, కే కరుణాకర్‌రావు ఎన్ని కయ్యారు. కమిటీ సభ్యులుగా పి గిరిజ, డి విజయభాస్కర్ రెడ్డి, ఎం శ్రీనివాస్ రెడ్డి, వై బర్నబాస్, ఏ శౌరీ భర్తలం, కే బాబురావు, దర్శనపు విజయబాబు ఎన్నికయ్యారు.

జెండా ఆవిష్కరణలో ప్రతినిధులు

పట్టాభి పురస్కారం అందుకున్న వారితో పద్మశ్రీ సి.వి.రాజు, డాక్టర్ సమరం తదితరులు

## 9 మందికి పట్టాభి పురస్కారాలు

**ప్రజాశక్తి-గుంటూరు**

డాక్టర్ పట్టాభి కళా పీఠం 14వ వార్షికోత్సవం సందర్భంగా గుంటూరు 2/7 బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన సభలో ప్రతిభావంతులైన 9 మందికి పట్టాబి. పుపురస్కారాలు అందజేశారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన పద్మశ్రీ పురస్కార గ్రహీత సి.వి.రాజు మాట్లాడుతూ కళలకు ఆదరణ తగ్గుతుందని, కళాకారులకు కొదవ లేని రాష్ట్రంలో కళలను ఆదరంచాల్సిన అవసరం ఉందన్నారు. కళలు మనోవికాసానికే కాకుండా మనిషి మంచి ప్రవర్తన కలిగి జీవించేందుకు దోహదపడతాయని అన్నారు. డాక్టర్ సమరం మాట్లాడుతూ కళలు అజరామరం అని, కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వపై ఉందన్నారు. కళలు దేశ ఔన్నత్యానికి, సంస్కృతికి అద్దం పడతా యన్నారు. రాష్ట్రంలో చింతామణి పాత్ర పోషిస్తున్న రత్నశ్రీ మాట్లాడుతూ నాటకాలు కేవలం వినోదానికే కాక, విజ్ఞానానికీ నిదర్శనం అన్నారు. అనంతరం స్త్రీ శక్తి అవార్డు కింద గద్వాల్‌కు చెందిన డాక్టర్ జాన్సీలక్ష్మీతోపాటు 9 మంది ప్రముఖులను పట్టాభి అవార్డులతో సత్కరించారు. ఎ.మానస (నాట్యం), డాక్టర్ ఎల్.వరలక్ష్మి (పర్యావరణం), డాక్టర్ బి.అంజయ్య (వైద్యం), డాక్టర్ సిహెచ్.స్వరాజ్యలక్ష్మి (విద్య), జి.రత్నశ్రీ(రంగస్థలం), డాక్టర్ కె.వి.అనంతశయనం(సంగీతం), డాక్టర్ వజ్రగిరి జస్పిన్ (చిత్రలేఖనం), డాక్టర్ ఎంబిడి శ్యామల(కవిత్వం), డాక్టర్ సమరం(వైద్యం)ను సత్కరించారు. సభకు కళాపీఠం అధ్యక్షులు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. డాక్టర్ జగత్ శ్రీనివాస్, డాక్టర్ ఎస్‌బిఎస్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి చదువే సరైన మార్గం

ప్రజాశక్తి- మాచర్ల

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని, రాజకీయంగా బలనీయమైన శక్తిగా ఎదిగి, తగిన ప్రాతినిథ్యం సాధించాలని విశాఖపట్నం దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ అన్నారు. పట్టణంలో ఆదివారం జరిగిన కార్తిక వన సమారాధనకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ యాదవులు ఐక్యంగా ఉండి రాజకీయంగా ఆర్థికంగా బలపడితేనే సమాజంలో నిజమైన గుర్తింపు పొందగలరని అన్నారు. పిల్లలను బాగా చదివించుకోవాలని, అభివృద్ధికి చదువు ఒక్కటే సరైన మార్గమని టిటిడి పాలకమండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి అన్నారు. తెలంగాణలోని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడుతూ యాదవులు తమలోతాము తగువులు పెట్టుకోకుండా అభివృద్ధి, విద్య, వ్యాపారాల వైపు దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో బి.రామకృష్ణ యాదవ్, టి.వెంకటేష్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ కె.కోటయ్య, జి.రామకృష్ణారావు, జివి యాదవ్, జె.నాగేశ్వరరావు, కె.నాగరాజు, జి.శ్రీనివాస్ యాదవ్, ఎం.రాంబాబు, ఎస్.నాగేశ్వరరావు, జె.కొండలు, వై.నాగరాజు, సురేష్, సాంబశివరావు పాల్గొన్నారు.

## బాలికా విద్యతోనే నవ సమాజం

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

నవ సమాజ స్థాపన జరగాలంటే బాలికా విద్యతోనే సాధ్య పడుతుందని గుంటూరు కమ్మసంఘం సభ్యులు పి.సాంబశివరావు అన్నారు. ఆదివారం స్థానిక నరిశెట్టి కల్యాణ మండపంలో నియోజకవర్గ కమ్మ సేవా సమితి కార్తీక వనసమారాధనలో ఆయన మాట్లాడారు. బాలికల విద్య ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని, అసమానతలను తగ్గిస్తుందని, ఇది మరింత స్థిరమైన సమాజాలకు దోహదం చేస్తుందని చెప్పారు. ఆర్థికంగా ఎదిగిన కుటుంబాలు సామాజిక సేవా రంగాల్లో కూడా ముందుండాలన్నారు. సామాజిక వర్గంలో ఆర్థిక ఇబ్బందులతో చదువుకోలేని వారికి అండగా నిలబడాలన్నారు. 40 మంది విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహకాలు అందించారు. మహిళలకు 20 చీరలు పంపిణీ చేశారు. ఎం.సురేష్‌బాబు, డి.గోపి, సీతారామయ్య, వై.మల్లికార్జున రావు, వై.వెంకట్రామయ్య, ఎం.రవి, ఎం.శివకృష్ణ, బి.బ్రహ్మం, కృష్ణయ్య, ఆంజనేయులు, మల్లికార్జునరావు, వెంకట నర్సయ్య, నరసింహారావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## చాగంటివారిపాలెంలో వనసమారాధన

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని చాగంటివారిపాలెం జగన్నాథస్వామి దేవాలయంలో కాపు సంఘీయుల వన సమారాధన ఆదివారం జరిగింది. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కుమారుడు, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు హాజరయ్యారు. కమిటీ సభ్యులు ఎస్.వెంకటరావు, ఎ.వెంకటస్వామి, ఎ.శివ, జె.వాసు, డి.కోటేశ్వరరావు, బి.పూర్ణమహేష్, టి.నరసింహారావు, ఎ.సుబ్బారావు, టి.శ్రీనివాసరావు, కె.సురేష్ పాల్గొన్నారు.

# కార్మిక, కర్షక సమస్యలపై రేపు ధర్నా

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్ వద్ద మంగళవారం జరిగే కార్మిక, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కూలీల ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.హరిపోతురాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని 17వ వార్డు శాలివాహన నగర్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరిపోతురాజు మాట్లాడుతూ పంటకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి రుణ సౌకర్యం కల్పించాలని, పంట నష్టపరిహారం కౌలు రైతులకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి నాలుగు కోడ్లను తెచ్చిందని, వాటిని రద్దుచేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం చట్టం అమలు చేయాలన్నారు. ఈ అంశాలపై జరిగే ధర్నాను అన్ని రంగాల ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. డివైఎఫ్ఐ నాయకులు జె.రాజకుమార్, జాన్ బాషా పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు, రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. వేలూరు, గణపవరం, అప్పాపురం, చిలకలూరిపేట

పట్టణంలో జీపులో మైకు ప్రచారంతోపాటు కరపత్రాలు పంపిణీ చేశారు. సిఐటియు మండల కన్వీనర్ పి.వేంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు టి.బాబురావు, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి సిహెచ్ నిర్మల, ఎఐటియుసి నాయకులు డి.వరహాలు, ఎస్.లూథర్ పాల్గొన్నారు.

# అడిగిందే తడవుగా సిఎం సహాయనిధి : జీవీ

చెక్కులు అందిస్తున్న జీవీ ఆంజనేయులు, మల్లికార్జునరావు

ప్రజాశక్తి - వినుకొండ

పేదలు, అవసరంలో ఉన్న వారు అడిగిందే తడవుగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సీఎం చంద్రబాబు సాయం అందిస్తున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయలు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 47 మందికి రూ.92 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను తన క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి జీవీ ఆంజనేయులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014-19లో సీఎంగా చంద్రబాబు ఉన్నప్పుడు ఐదేళ్లలో వినుకొండ నియోజకవర్గంలో 2,842 మందికి రూ.11.78 కోట్లను సిఎం సహాయ నిధిగా ఇచ్చారన్నారు. ఇప్పుడూ అడిగిందే తడవుగా.. ఒక్కటి కూడా తిరస్కరించకుండా ఆర్థిక సాయం చేస్తున్నారన్నారు. 23 ఏళ్లలో ఏపీని అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని, ప్రతివ్యక్తి, కుటుంబం తలసరి ఆదాయం పెంచాలనే లక్ష్యంతో చంద్రబాబు ఉన్నారన్నారు. ఇంటికో ఉద్యోగం, పారిశ్రామికవేత్తను తయారుచే యాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారని తెలిపారు. హ్యాపీనెస్ ఇండెక్స్‌లో ప్రపంచంలోని ఏపీ మొదటిస్థానంలో ఉండాలనే లక్ష్యంతో సీఎం ప్రణాళికలు చేపట్టారన్నారు. ఆరోగ్యాంధ్ర ప్రదేశ్, ఆనందాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని, లైఫ్ ఇండెక్స్ పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పారు. అందుకోసమే బడ్జెట్‌లో వైద్యారోగ్యశాఖకు రూ.18,421 కోట్లు కేటాయించారని తెలిపారు. 20 లక్షలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా కార్యాచరణ చేపట్టారని, నైపుణ్య శిక్షణ ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జి.సాంబశివరావు, ఎన్.రామకోటేశ్వరరావు, వై.కోటేశ్వరరావు, జి.హనుమంతరావు, పీవీ సురేష్‌బాబు, బిజెపి నాయకులు ఎం.రమేష్, పి.వెంకటకృష్ణ, ఎం.రాంబ్రహ్మం పాల్గొన్నారు.

## ఎ.ముప్పాళ్లలో రూ.90 లక్షలతో ఏసీ కళ్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి-ఈపూరు

గ్రామస్తులు ఐక్యంగా కృషి చేస్తే గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించవచ్చని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని ఆరేపల్లి ముప్పాళ్లలో రూ.90 లక్షలతో నిర్మించిన కళ్యాణ మండపాన్ని ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. దాతల సహకారంతో గ్రామస్తులు ఏసీ కళ్యాణ మండపం నిర్మించటం గ్రామాభివృద్ధికి నిదర్శనమని చెప్పారు. అందరూ కలిస్తే గ్రామంలో అవసరాలను తామే పరిష్కరించుకోవచ్చని అన్నారు. అనంతరం దాతలను సన్మానించారు. టిడిపి సీనియర్ నాయకులు మోదుగుల సత్యనారాయణ మాట్లాడుతూ గృహాలపై ఉన్న విద్యుత్ తీయగలను తొలగింపచేయాలని, గ్రామంలో కాలుష్యనీటితో గ్రామస్తులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని చీఫ్‌విప్ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, తానా (అమెరికా) అధ్యక్షులు ఎస్.నిరంజన్, పల్నాడు జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జగ్గారావు, రాష్ట్ర తెలుగురైతు అధికార ప్రతినిధి పి.నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ మోదుగుల నరసింహారావు, లింగా శివ, మండలాధ్యక్షులు టి.బాలయ్య, ఇ.హనుమయ్య పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై నేడు ర్యాలీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచేందుకు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో గడియార స్తంభం సెంటర్ నుంచి 200 మంది మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులతో ట్రాఫిక్ సిఐల ఆధ్వర్యంలో అవగాహన సోమవారం నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ర్యాలీ ప్రారంభం అవుతుందని చెప్పారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవిందబాబు

# 3 రాష్ట్రాల్లోని 650 మంది విద్యార్థులకు పోత్సాహకాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని ఎన్ఇసి కళాశాలలో డాక్టర్ విజయ నిర్మల మెమోరియల్ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా ఆర్ట్స్ అండ్ స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ అవార్డ్స్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుండి 650 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, సినీ నటుడు నరేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ తన తల్లి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది కుంగ్ ఫూ, కరాటే, కర్ర సాము, యోగ, భరత నాట్యం వంటి కళల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించి బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మార్షల్ ఆర్ట్స్‌కు సంబంధించి ఒక విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్నానని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్ఇసి కళాశాలలో ఇటీవల వరల్డ్ స్పేస్ వీక్ ప్రోగ్రాం భారీ స్థాయిలో నిర్వహించడం పల్నాడు జిల్లాకే గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ చక్రవర్తి, సెక్రటరీ రమేష్, పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## వంకాయలపాడులో కాటూరి హాస్పిటల్ వైద్యశిబిరం

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని వంకాయలపాడులో కాటూరి మెడికల్ కాలేజ్ - హాస్పిటల్ అధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, గ్యాస్ట్రో, గుండె, కళ్లు, ఎముకలు, కీళ్ల నొప్పులు, చెవి, ముక్కు, గొంతు, కిడ్నీ, శ్వాసకోశ వ్యాధులకు పరీక్షలు చేయడంతోపాటు అవసరమైన వారికి మందులు అందించారు. ఈసీజీ పరీక్షలు చేశారు. ముఖ్య అతిథిగా మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు హాజరయ్యారు. డాక్టర్ కె.మాధవి, డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ బ్రాయాన్, డాక్టర్ అమూల్య, క్యాంప్ ఆర్గనైజర్ జె.నాగేంద్రాబాబు, గ్రామ అధ్యక్షులు షేక్ బుడే, ఎస్.శరత్, మస్తాన్‌వలి, నాగుర్‌వలి, కె.సాంబశివరావు పాల్గొన్నారు.

# ధాన్యం రైతు దైన్యం

**తుపాను భయంతో హడావుడిగా కోతలు**

**మద్దతు ధరకు అమ్మాలన్నా కొనుగోలు కేంద్రాలు లేవు**

**దళారులు చెప్పిన ధరకే విక్రయాలు**

ప్రజాశక్తి - దుగ్గిరాల

**గత సంవత్సరం ఖరీఫ్‌సాగులో అకాల వర్షాలకు రైతు నిండా మునిగాడు. ఈ ఖరీఫ్‌లో పంట చేతికొచ్చేసరికి తుపాను హెచ్చరికలు రైతు గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. కౌలు రైతు పరిస్థితి అయితే మరింత దయనీయంగా మారింది. వచ్చిన పంట అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రాలు లేవు.**

**దుగ్గిరాల మండలంలో 20వేల ఎకరాల్లో వరి సాగుచేశారు. దళారి చెప్పిన ధరకే విక్రయించుకునే దైన్యమైన పరిస్థితులు వచ్చాయని రైతులు వాపోతున్నారు.**

బంగాళాఖాతంల వాయుగుండం వల్ల వర్షాలు వచ్చే అవకాశమున్నందున మండల కేంద్రం దుగ్గిరాలలో శనివారం నుండి తుపాను భయంతో ఆఘమేఘాల యంత్రాలతో వరి పంట నూర్పిడి ప్రారంభించారు. గత సంవత్సరం నూర్పిడిలలో 77 కేజీల బస్తా రూ.1900 నుండి రూ.1950 వరకు వ్యాపారస్తులు కొనుగోలు చేయగా ప్రస్తుతం రూ. 1400లకు కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో బస్తాకు దాదాపు రూ.500 నుండి రూ.550 వరకు ధరలు తగ్గించి వేశారు. దిగుబడి కూడా గత సంవత్సరం కంటే ఎకరాకు ఐదు నుండి పది బస్తాలు తగ్గిపోయాయని రైతులు వాపోతున్నారు. గత సంవత్సరం దిగుబడి 40 బస్తాలు కాగా ఈ సంవత్సరం విత్తనాలు చల్లిన సమయంలో పడిన అకాల వర్షాలకు దిగుబడి తగ్గిపోయి ఎకరాకు 30 నుండి 35 బస్తాలు దిగుబడి ఉండవచ్చునని రైతులు తెలిపారు. దీనితో ఒక్క రైతు ఎకరాకు రూ. 30 వేలు నష్టపోయే పరిస్థితి ఏర్పడినది. కౌలు రైతులకైతే పెట్టుబడి కూడా రాని పరిస్థితి. బంగాళాఖాతంలో శనివారం ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి మంగళ, బుధ వారలలో ఈ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేస్తున్నా హెచ్చరికలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. వర్షాలు కురిస్తే పంట మునిగి పడిపోతుందని యంత్రాల ద్వారా కోతలు కోయాలన్న ఎక్కువ సమయం పడుతుంది. ప్రస్తుతం యంత్రాల ద్వారా గంటకు రూ.3 వేలు వసూలు చేస్తున్నారు. ఎకరం కోతకు దాదాపు రెండు గంటలు పడుతుంది. అదే వర్షం కురిస్తే పంట నష్టపోవటమే గాక చేలు పడిపోయి కోతకు ఎక్కువ సమయం పట్టవచ్చు.

ప్రభుత్వం క్వింటాకు రూ.2300 మద్దతు ధర ప్రకటించింది. 77 కేజీల బస్తా రూ.1771 అయితే డెల్టా ప్రాంతంలో 75 శాతం వరకు ఉన్న కౌలు రైతులకు ఉపయోగమే ఉండదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఇంతవరకు ప్రారంభించలేదు. దీనితో మద్దతు ధర రైతులు, కౌలు రైతులకు అందని పరిస్థితి. ప్రస్తుతం పాత ధాన్యం 77 కేజీల బస్తా రూ.2200 పలుకుతుంది. రైతులు ధాన్యం నిలువ చేసుకునే అవకాశం లేదు. కౌలు రైతులయితే వెంటనే ధాన్యం అమ్మి కౌలు కట్టవలసిన పరిస్థితి. మద్దతు ధర వలన రైతులకు కౌలు రైతులకు వరిగేది ఏమీ లేదు. ఖరీఫ్ లో ధర లేక దిగుబడి తగ్గి తీవ్రంగా నష్టపోతున్న రైతన్నలు తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

## కనీసం గుర్తింపు కార్డు లేదు

**పఠాన్ రియాజ్ ఖాన్, కౌలు రైతు, దుగ్గిరాల**



గత పదేళ్లనుండి కౌలుకు వ్యవసాయాం చేస్తున్నాను. కనీసం గుర్తింపు కార్డు కూడా లేదు. గత సంవత్సం రూ.రెండున్నర లక్షలు అప్పులయ్యాయి. ఏమీ మిగలలేదు. అప్పులు కూడా తీరలేదు. ఈ సంవత్సరం కూడా అకాల వర్షాలంటున్నారు. పంట చేతికి వచ్చేవరకు ప్రభుత్వం భరోసా ఉ ండాలి. కౌలురైదు గుర్తింపు కార్డుతో సబంధం లేకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొని రైతును ఆదుకోవాలి.

## ప్రభుత్వ పథకాలు అందలేదు

**షేక్ సుభాని, కౌలు రైతు, దుగ్గిరాల**

నష్టపోయిన రైతులను ఆదుకోవటానికి ప్రభుత్వం వద్ద ఏ పథకాలు లేనట్లు తెలుస్తుంది. మద్దతు ధర వలన కౌలు రైతులకు వరిగేది ఏమీ లేదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేది ఎప్పుడో. ఎలాగూ ప్రభుత్వం నింబధనలపేరుతో మా వద్ద కొనుగోలు చేయరు. గతంలో కొన్న వాళ్ళకే డబ్బులు సకాలంలో పడలేదు. ఈ సంవత్సరం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. పడ్డ కష్టానికి ఫలితం రావాలంటే ప్రభుత్వం పట్టించుకోవాలి.

## కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా ధాన్యాన్ని రైతుల వద్ద నుండే, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కొనుగోలు చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎంటిఎంసి పరిధిలోని చిర్రావూరు గ్రామంలో ధాన్యం కల్లాల వద్ద పలువురు రైతులను కలిసి, నాయకులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన క్వింట ధాన్యం రూ. 2340 రేటు ప్రకారం 75కేజీల ధాన్యానికి 1740 ఇవ్వాల్సి ఉండగా, 1400 నుండి 1350 రూపాయలకే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయడం అన్యాయమన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వం ప్రకటించిన ధర ప్రకారం కొనుగోలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల సీనియర్ నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చిర్రావూరులో దాన్యం రైతులతో మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు

రోగులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న డాక్టర్ శారద

## బుర్రిపాలెంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : వైద్య నిపుణుల సూచించిన ఆహారపు నియమాలను ఆచరిస్తే ఆయుష్‌కాలం పెంచుకోవచ్చని డాక్టర్ శారద అన్నారు. తెనాలి గ్రామం బుర్రిపాలెంలో ఆదివారం డాక్టర్ శారద సర్వీస్ సొసైటి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. వైద్య శిబిరానికి వేకువ జాము నుంచి రోగులు క్యూ లైన్లు కట్టారు. ప్రతి నెల ఆఖరి ఆదివారం నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో రోగులకు బిపి, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణి చేశారు. వైద్యులు సూచించిన ఆహారపు నియ మాలను, అలవాట్లను తప్పకుండా పాటించాలని డాక్టర్ శారద తెలిపారు. యోగ, వాకింగ్ ద్వారా మానసిక ఒత్తిడిని నియంత్రించు కోవచ్చన్నారు.

## చెట్లు పెంచండి-ఆరోగ్యంగా ఉండండి

ప్రజాశక్తి-తాడేపల్లి

చెట్లను పెంచడం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉండొచ్చని తాడేపల్లి సుందరయ్య నగర్ లోని గుడ్ న్యూస్ హైస్కూల్ ప్రిన్సిపల్, రె వ ఫాదర్ ఆరో కి యా దాస్ చెప్పారు. ఎన్ సి సి దినోత్సవం సందర్భంగా ఎన్ సి సి క్యాండిడేట్లతో హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటించారు. చెట్లు ,మొక్కలు మనిషి జీవితంలో భాగమని స్పష్టం చేశారు. వాతావరణ సమూల్యత కాపాడటంలో చెట్లు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. మనం ప్రతిరోజు పీల్చుకునే ఆక్సిజన్ చెట్ల ఆకుల ద్వారానే వస్తుందని వివరించారు. పండ్ల మొక్కలు, కూర గాయల మొక్కలు పెంచడం ద్వారా, విత్తనాలు భూమిలో వెదజల్లటం ద్వారా భూమి మరియు ప్రకతి సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్, సి టి ఓ, కే అజయ్ కుమార్ పాల్గొన్నారు.

## తరుణ్‌కు బెస్ట్ ఎన్‌సిసి క్యాడెట్ అవార్డు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఎన్సిసి డే సందర్భంగా ప్రతి ఏడాది ఎన్సిసి కేడేట్ లకు ఇచ్చే బెస్ట్ కేడెట్ అవార్డును శ్రీ రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి యడ్ల తరుణ్ గెలుచుకున్నారని పాఠశాల ప్రధానోపా ధ్యాయుని షేక్ మౌలాబి అన్నారు. గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్‌ఎం చంద్రశేఖర్ ఆదివారం ఈ అవార్డు ప్రదానం చేసినట్లు తెలిపారు. గత ఐదు సంవత్సరాలుగా బెస్ట్ క్యాడెట్ అవార్డు తమ పాఠశాల ఎన్సిసి విద్యార్థులే దక్కించుకున్నారని ఎన్సిసి అధికారి పరిశా సర్దార్ అన్నారు. పలువురు తరుణ్‌ను అభినందించారు.

## చెవిలో పూలతో ఎసిసి కార్మికుల నిరసన

ప్రజాశక్తి-తాడేపల్లి : తమ న్యాయమైన సమస్యను ప్రభుత్వం జోక్యం చేసుకొని, యాజమాన్యం చేత ఒప్పించి పరిష్కారం చేయాలని సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ కార్యదర్శి కె స్టీవెన్ కోరారు. సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 27వ రోజుకు చేరుకున్నాయి. సందర్భంగా దీక్ష శిబిరంలో స్టీవెన్ మాట్లాడుతూ నేటి నుండి పక్కా ఇండ్ల నిర్మాణానికి కార్మిక వర్గం దిగుతుందని చెప్పారు. మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు తమ సమస్యను పరిష్కరించి తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం ఆశీర్వాదం, కే ఆదినారాయణ, సాంబయ్య, శారద, శారమ్మ, ఇమాంబి, దుర్గ భవాని, నాగేశ్వరరావు, సుబ్బారావు, ఇశ్రాయేలు, పాల్గొన్నారు

## లివర్, జీర్ణకోశ వ్యాధులపై అవగాహన ఉండాలి

**డాక్టర్ సిద్ధార్థారెడ్డి**

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆదివారం లివర్, జీర్ణకోశ వ్యాధులపై జరిగిన ఆరోగ్య సభలో గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సిద్ధార్థరెడ్డి ఆళ్ళ ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. సంస్థ సీనియర్ సభ్యులు కళ్యాణం చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ ఆహారంలో మసాలా, కారం, పచ్చళ్ళు, వేపుళ్ళు, బాగాఫ్రై చేసిన వివిధ రకాల శాఖాహార, మాంసాహార వంటకాల వలన గ్యాస్ట్రబుల్‌కు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వస్తున్నాయన్నారు.ప్రాసెస్డ్ ఫుడ్, ప్యాకెట్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. పెద్దల్లో, పిల్లల్లో జీర్ణకోశ సంబంధిత వ్యాధులు వస్తున్నాయన్నారు. తేలికగా అరిగే విధంగా, అధికంగా పీచు పదార్థం కలిగిన , తాజా ఆహారం, పౌష్టిక విలువల కలిగిన ఆహారం, సమయానికి తీసుకుంటూ రోజు కనీసం 45 నిమిషాలు వ్యాయామం చేయాలన్నారు. లివర్ గురించి వివరిస్తూ.. మనం తీసుకున్న ఆహారం జీర్ణం అయ్యేందుకు కావాల్సిన వివిధ జీర్ణరసాలను ఉత్పత్తి చేస్తుందని, మన వివిధ అనారోగ్య ఆహారపు అలవాట్ల వలన, ఆల్కహాల్ వినియోగించడం వలన లివర్ దెబ్బతింటుందని చెప్పారు. లివర్ పనితీరు మందగిస్తే గ్యాస్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. రోజు సరిపడ విశ్రాంతి తీసుకోకపోయినా వారిలో కూడా గ్యాస్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని తెలిపారు. కావున రోజుకు ఏడు నుండి ఎనిమిది గంటలు నిద్రపోవాలన్నారు. డాక్టర్ సలహా లేకుండా దీర్ఘకాలికంగా గ్యాస్ ట్రబుల్ మాత్రలను వినియోగించరాదని సూచించారు. అనంతరం డాక్టర్ సిద్ధార్థ రెడ్డిని సభ్యులు సత్కరించారు.సభలో టీవీ సాయిరాం, స్కాట్ శ్రీనివాసరావు , బండారు శ్రీనివాసరావు , చల్లా అంజిరెడ్డి తదితరులు ప్రసంగించారు.

## ఇప్పటంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని ఇప్పటం గ్రామంలో ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ కార్యక్రమం జరి గింది. లబ్ధిదారులు వీరంకి వెంకట రత్తయ్య, సాదు వెంకట శివనాగలక్ష్మి దుర్గ లకు టిడిపి గ్రామ అధ్యక్షుడు శంకరశెట్టి పిచ్చయ్య, జనసేన పార్టీ అధ్యక్షులు గాజుల రాంబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శి జిముడుగాని రత్తయ్య, జెముడు గాని మహేంద్ర గౌడ్, కాటూరి నాగేశ్వరరావు, గాజుల నగేష్ పాల్గొన్నారు.

## ఉత్తమ ఎన్‌సిసి ఆఫీసర్‌గా సెయింట్ ఆన్స్ అధ్యాపకురాలు

ప్రజాశక్తి-గుంటూరు

అవార్డు అందుకుంటున్న సుశ్మిత

గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజిలో 10 (ఎన్) ఆంధ్రాగరల్స్ బెటాలియన్ అసోసియేటివ్ ఎన్‌సిసి అధికారి, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ ఆర్.సుస్మితకు 76వ ఎన్‌సిసి దినోత్సవం సందర్భంగా ఉత్తమ అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పట్టాభిపురంలోని యుఆర్‌సి క్యాంటింగ్ ప్రాంగణంలో గుంటూరు గ్రూప్ కమాండర్, కల్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్, ఆడమ్ మేజర్ అవినాపట్వాల్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని సుస్మిత అందుకున్నార. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సి.సంధ్య.టి, అధ్యాపకులు, సిబ్బంది సుస్మితను అభినందించారు.

## విజయవాడలో నేడు 108 ఉద్యోగుల మహాధర్నా

ప్రజాశక్తి-గుంటూరు : 108 అంబులెన్స్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్స్ పరిష్కారం కోసం నవంబర్ 25వ తేదీ తర్వాత సమ్మె చేపట్టబోతున్న నేపథ్యంలో నేడు విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని 108 అంబులెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటి యు జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు కోరారు. ఆదివారం బ్రాడీపేట లోని సిఐటియు కార్యాలయంలో జరిగిన యూనియన్ సమా వేశంలో లక్ష్మణరావు మాట్లాడుతూ 108 అంబులెన్స్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్స్ పరిష్కారం కోరుతూ పదేపదే ప్రభుత్వానికి, యాజమాన్యంకు విన్నివించినా పట్టించుకోలే దన్నారు. సమ్మెకు యాజమన్యం, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణం అన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.శివశంకర్, షేక్.బాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ.రామకష్ణ, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ షేక్ హసన్, వర్కింగ్ ప్రెసిడెంట్ యం.హసన్ కమల్, జిల్లా కోశాధికారి బి యెహెూషువ, గుంటూరు డివిజన్ అధ్యక్షులు వి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## మాస్టర్ అథ్లెటిక్స్ మీట్‌కు 120 మంది అర్హత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ మీట్‌కు జిల్లా నుంచి 120 మంది అర్హత సాధించారని రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు షేక్ లాల్ వజీర్ తెలిపారు. జిల్లా జట్టులో మహిళలు, పురుషులు 30 ఏళ్లనుంచి 70 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు అధి కంగా పాల్గొన్నారని, మహిళలు ఎక్కువగా వాకి ంగ్ ఈవింట్‌లో పాల్గొన్నారు. పురుషులు ఎక్కు వగా త్రోస్ లో పాల్గొన్నారు. జిల్లా జట్లులో పాల్గొన్న వారు గుంటూరులో రాష్ట్ర మీట్ లో పాల్గొంటారు. రాష్ట్ర మీట్ లో ఫస్ట్, సెకండ్ స్థానాలు, పొందినవారు, కేరళలోని తిరుసూర్ పట్నం లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని లాల్ వజీర్ తెలిపారు. కార్యక్రమంలో షేక్ నజీర్, కోటేశ్వరరావు, లక్ష్మి, నవమి, ఫ్లోరా, విజయ్, మూర్తి,వెంకటేష్, రామకష్ణ, శివ కోటయ్య పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యను పరిరక్షించుకోవాలి : ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

### ఘనంగా యుటిఎఫ్ గుంటూరు జిల్లా స్వర్ణోత్సవ మహాసభ

### జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా యు.రాజశేఖర్, ఎం.కళాధర్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయులు పోరాడాలని, ప్రభుత్వ విద్య ద్వారానే సామాజిక న్యాయం దక్కుతుందని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను ఆదివారం గుంటూరు ఎన్‌జిఒ హోంలో నిర్వహించారు. తొలుత వెంకటేశ్వరా విజ్ఞాన మందిరం నుండి ఎన్‌జిఒ హోం వరకూ ఉపాధ్యాయుల ర్యాలీ నిర్వహించారు. మహాసభల ప్రారంభ సూచికగా జాతీయ జెండాను, ఎస్‌టిఎఫ్ఐ జెండాను, యుటిఎఫ్ జెండాను కెఎస్‌వి దుర్గారావు, జి.ప్రభుదాసు, ఎన్.తాండవ కృష్ణ ఆవిష్కరించారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ దేశంలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో గత 30 ఏళ్లలో విద్యా కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ పెరిగిందన్నారు. విద్యా ప్రేవేటీకరణను మరింత ప్రోత్సహించే విధంగా మోడీ ప్రభుత్వం నూతన విద్యావిధానం తెచ్చిందన్నారు. ఎన్ఇపి-2020 సారాంశం ప్రధానంగా సెంట్రలైజేషన్, కమర్షియలైజేషన్, కమ్యూనలైజేషన్ అని చెప్పారు. గత ప్రభుత్వం తెచ్చిన 117 జిఒ, ప్రాథమిక తరగతుల విలీనం అందులో భాగమేనన్నారు. కూటమి ప్రభుత్వం జిఒ 117ను రద్దు చేస్తామని ఇంత వరకూ చేయలేదన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రైవేటీకరణ విధానాలే అమలు చేస్తున్నాయన్నారు. ఇటీవల మండలి సమావేశాలలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఉద్యోగుల బకాయిలు రూ.22వేల కోట్లు తక్షణమే విడుదల చేయాలన్నారు. యుటిఎఫ్ 50ఏళ్ల ఉద్యమ చరిత్ర అనేక అనుభవాలు నేర్పిందని, పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలమని చెప్పారు. ఉపాధ్యాయులు సామాజిక బాధ్యతతో పనిచేయాలన్నారు. 2007 నుండి ఇప్పటి వరకూ పిడిఎఫ్ మండలిలో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రైతులు ఇతర ప్రజల సమస్యలపై పోరాడుతుందని, బాధితుల స్వరం పిడిఎఫ్ అని చెప్పారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యుటిఎఫ్ ఉద్యమ నిర్మాణంలో గుంటూరు జిల్లా సీనియర్ నేతల పాత్ర ఎంతో ఉందన్నారు. వారి స్ఫూర్తితో ప్రభుత్వ విద్య రంగా రక్షణకు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు అందర్ని ఒకే గొడుగు కిందకు తెచ్చిన ఘనత యుటిఎఫ్‌కు దక్కుతుం దన్నారు. విలువలు, త్యాగాలతో సంఘం నిర్మితం అయ్యిందన్నారు. పోరాడితేనే హక్కులు సాధించుకో గలమని, బతిమా లుకుంటే రావన్నారు. పాఠశాలలు మూతపడు తున్నాయని, విద్యార్థులు ఉంటేనే ఈ వ్యవస్థ ఉంటుందన్నారు. యుటిఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు కె.జోజయ్య మాట్లాడుతూ 50ఏళ్ల ఉద్యమ చరిత్రలో ఏకైక పెద్ద సంఘ ంగా, ఎన్నో విజయాలు సాధించిన సంఘంగా యుటిఎఫ్ నిలిచిందన్నారు. స్వర్ణో త్సవాల వెలుగులో రాబోయే కాలంలో ఉపాధ్యా యులు ఐక్యంగా పోరాడాలన్నారు. కార్యక్ర మంలో రాష్ట్ర సహాధ్యక్షురాలు ఎ.ఎన్. కుసుమ కుమారి, సీనియర్ నాయకులు ఎన్.తాండవ కృష్ణ, కెఎస్‌వి దుర్గారావు, జి.ప్రభుదాసు, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ యం.హనుమంత రావు, జిల్లా గౌరవాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యం.కళాధర్ ప్రసంగించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ సౌహార్ద సందేశం ఇచ్చారు.

మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

జెండా ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకులు

యు రాజశేఖర్
యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

ఎం కళాధర్
యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

### నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పి.శ్రీని వాసరావు, అధ్యక్షులుగా యు.రాజశేఖరరావు, ప్రధాన కార్యదర్శి యం.కళాధర్, సహాధ్యక్షులుగా జి.వెంకట్వేర్లు, సహాధ్యక్షులుగా ఎస్.నాగమణి, కోశాధికారి ఎమ్‌డి దౌలా, కార్యదర్శులుగా సిహెచ్.ఆదినారాయణ, కె.సాంబశివరావు, జి.వెంకటేశ్వరరావు, టి.ఆంజనేయులు, యం.గోవిందయ్య, కె.కేదార్ నాథ్, ఎమ్‌డి.షకీలాబేగం, కె.రంగారావు, కె.కామాక్షి, బి.ప్రసాద్ ఎన్నికయ్యారు.

# దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

- ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు
- రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపాలి
- పల్నాడులో నూరుశాతం ఈ-క్రాప్ నమోదు
- పంట నష్టానికి రూ.6.08 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ
- ప్రజాశక్తితో జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళి

**పల్నాడు జిల్లాలో వరి సాగు చేపట్టిన రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవాల్సిన అవసరం లేదని రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కొనుగోలు చేస్తామని పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ. మురళి అన్నారు. రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోలు సందర్భంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రతి విషయంపై వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా కల్తీ, లేదా అధిక ధరలకు విక్రయం జరిగితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు. కంపెనీలతో ఒప్పందం లేకుండా పొగాకు వేయవద్దని, ప్రత్నామ్నాయ పంటలవైపు దృష్టి సారించాలన్నారు.**

**ప్రాథమిక దశలో రైతులకు ఇచ్చే సలహాలు సూచనలు?**

ప్రస్తుత పరిస్థితులలో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు సలహాలు సూచనలు చేస్తుంది. పంటల సాగులో అధిక దిగుబడికి ఆచరించే పద్ధతులు ఎంతో కీలకం. వేసవిలో లోతు దుక్కి చేసుకోవడం దగ్గర నుండి, నాణ్యమైన విత్తనాల ఎంపిక, విత్తనశుద్ధి, సమగ్ర పోషక కలుపు యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు కీలక పాత్ర వహిస్తాయి. సమగ్ర సస్యరక్షణలో భాగంగా మొదటి దశలో మేలైన విత్తనం ఎన్నుకోవడం ఎంత అవసరమో, విత్తన శుద్ధి చేసుకున్న విత్తనాన్ని వాడడం కూడా అంతే ముఖ్యం. దీనివలన తక్కువ ఖర్చుతో పంటలను చీడపీడలు శిలీంద్ర బీజాల నుంచి కాపాడుకోవడమే కాకుండా నాణ్యమైన అధిక దిగుబడులను పొందవచ్చును. శుద్ధి చేసి విత్తుకోవడం ద్వారా నాటిన తర్వాత 25 నుంచి 30 రోజుల వరకు చీడపీడలు, తెగుళ్ళ నుంచి పంటను రక్షించుకోవచ్చు. ప్రస్తుతం విత్తనాలను శుద్ధి చేసి అమ్మడం జరుగుతుంది. ఒకవేళ విత్తన శుద్ధి చేసింది అయినా రైతులు విధిగా విత్తనశుద్ధి చేసుకోవాలి. 2వ సారి శుద్ధి చేయడం వలన ఎటువంటి నష్టం లేదు.

**ఖరీఫ్‌లో ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేశారు? ప్రధాన పంటల వివరాలు?**

ఖరీఫ్‌లో పల్నాడు జిల్లాలో 71 శాతం సాగు అయింది. 4,40,815 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. 1,64565 ఎకరాల్లో పత్తి, 100317.5 ఎకరాల్లో మిర్చి, 85,990 ఎకరాల్లో వరి, 67,345 ఎకరాలు కందిసాగవ్వగా, మొక్కజొన్న, మినుము 22,597.5 ఎకరాల్లో సాగుచేశారు.

**రబీ సాగుకు సంబంధించి ప్రణాళికలు?**

రబీలో 1,36,555 ఎకరాల్లో సాగు కావాల్సిఉ ండగా ఇప్పటికి 24,690 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. వీటిలో ప్రధానంలో 11,732.5 ఎకరాల్లో వరి, 12,957.5 ఎకరాల్లో శనగ, కంది, మొక్కజొన్నా సాగు చేపట్టారు.

**ఇటీవల వర్షాలకు పంట నష్టం ఎంత? నష్ట పరిహారం అంచనాలు వేశారా?**

ఈ ఏడాది వర్షాకాలంలో కురిసిన అధిక వర్షాలకు పల్నాడు జిల్లాలో 6240 మంది రైతులకు చెందిన 6,145 ఎకరాల్లో పంటల నష్టం వాటిల్లింది. పంటల నష్టంపై క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించగా రూ 6.08 కోట్ల నష్ట పరిహారం రైతులకు నేరుగా బ్యాంక్ ఖాతాలకు జమ చేశారు.

**పట్టనష్టం అధికంగా ఏ ప్రాంతంలో వాటిల్లింది?**

పల్నాడు జిల్లాలో అమరావతి మండలంలో అధికంగా పంటల నష్టం వాటి ల్లింది. వ్యవసాయ శాఖ అధికారుల

సూచనలతో రైతులు చేపట్టిన సమగ్ర యాజ మాన్య చర్యలతో కొంతమేర దెబ్బ తిన్న పంటలు సాధారణ స్థితికి వచ్చాయి.

**ఈ - క్రాప్ నమోదులో జాప్యం ఏర్పడిందని విమర్శలు వస్తున్నాయి కదా?**

ఆరోపణలలో ఎటువంటి వాస్తవం లేదు. వ్యవసాయ సిబ్బంది వెళ్లిన రైతులు సకాలంలో అందుబాటులో లేని సందర్భంలో కొంత జాప్యం ఏర్పడి ఉంటుంది. ఎట్టకేలకు 100 శాతం ఈ-క్రాప్ నమోదు చేశాం. కౌలు రైతులు సాగు చేసిన పంటలు సైతం ఈ-క్రాప్‌లో నమోదయ్యాయి.

**ఎరువుల కొరత ఉందని అక్కడక్కడ ఆరోపణలు వచ్చాయి?**

పల్నాడు జిల్లాలో ఎటువంటి ఎరువుల కొరత లేదు. రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఎరువుల కొరత అధిగమించడంలో నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు స్పందించారు. ఎరువులను జిల్లాలో ప్రాంతాల వారీగా అవసరానికి తగిన విధంగా సరఫరా చేశాం. ర్యాక్ పాయింట్లు సరైన ప్రాంతంలో లేకపోవడంతో సరఫరాలో చిన్న చిన్న అవాంతరాలు ఏర్పడ్డాయి. ఈ సమస్య కూడా త్వరలో పరిష్కారం అవుతుంది.

**రైతుసేవా కేంద్రాలలో ఎటువంటి సేవలు అందిస్తున్నారు?**

పల్నాడు జిల్లాలో 421 రైతుసేవా కేంద్రాలలో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉన్నారు. సాగుకు సంబంధించి సలహాలు సూచనలు అందజేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు వివరాలు రైతు సేవా కేంద్రాలలో సంప్రదిస్తే సకాలంలో అందజేస్తాము. వీటి ద్వారా అందజేసే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కల్తీ, నకిలీకి ఆస్కారం లేకుండా నాణ్యమైనవిగా ఉంటాయి.

**ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారా?**

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి ఇప్పటికే రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సలహాలు సూచనలు చేశాం. ప్రతి ఆర్.ఎస్.కె లో ధాన్యం తేమ శాతం కనుగొనే యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. 12 శాతం కంటే ఎక్కువ తేమ ఉండే ధాన్యం కొనుగోలు చేయడం సాధ్యపడదు. నూర్పిడి అనంతరం ధాన్యాన్ని రైతు సేవ కేంద్రంలో తేమ శాతం పరిశీలించి కొనుగోలు చేస్తాము. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు. రైతుల ఆర్థిక పరిస్థితిని బట్టి అవసరమైతే పొలంలో కూడా కొనుగోలు చేస్తాం. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలు పాటిస్తూ వ్యవసాయాన్ని లాభసాటి చేసుకోవాలి.

**జిల్లాలో పొగాకు సాగు పరిస్థితి ఏ విధంగా ఉంది?**

జిల్లాలో ప్రస్తుతం 3,600 హెక్టార్లలో పొగాకు సాగు చేస్తున్నారు. కొందరు రైతులు కంపెనీలతో ఒప్పందం చేసుకుని సాగు చేస్తున్నారు. వీరిని చూపి మరికొందరు పొగాకు సాగుకు సన్నాహాలు చేస్తున్నారు. పల్నాడు జిల్లాలో 10వేల హెక్టార్లలో సాగుకు రైతులు ఉపక్రమిస్తున్నారు. రైతులు ఒకరిని చూసి మరొకరు సాగు చేయరాదన్నారు. ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులు దృష్టి సారించాలి.

(ప్రజాశక్తి-పల్నాడుజిల్లా)